teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 169 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 15 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## విడుదలైన గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు

### పరీక్షల నిర్వహాణ కోసం కమిషన్ పకడ్బందీగా ఏర్పాట్లు




హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): టీజీ పీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు విడుదలయ్యాయి. రాష్ట్రంలో అక్టోబర్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు టీజీఎస్ పీఎస్సీ గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం

మిగతా 2 లో



# బీసీల కులగణనకు గ్రీన్ సిగ్నల్..

## గ్రామాల్లో పోటాపోటిగా ప్లెక్సీలు

స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కార్ ముందడుగు


లోకల్ బాడీస్ అభ్యర్థుల్లో నెలకొన్న సంతోషం

బీసీలతో పాటే ఎస్సీ, ఎస్టీల కులగణన సర్వేకు ప్లాన్




తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో బీసీల కులగణనకు ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. అయితే తాజాగా బీసీలతో పాటే ఎస్సీ, ఎస్టీల కులగణన సర్వే సైతం చేపట్టేందుకు సర్కార్ ఒకే చెప్పేసింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఇక స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఇప్పట్నుంచే ఎన్నికలకు సన్నద్ధం అవడం ప్రారంభించారు. దసరా పండుగకు ఒక్కరోజు ముందే

మిగతా 2 లో



## టపాసుల షాపులు పెట్టొద్దంటూ ఆదేశాలు జారీ

### కొవ్వొత్తులతో దీపావళిని సెలబ్రేట్ చేసుకోవాలని సూచనలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): దీపావళి పండుగ వస్తుంది 2024, అక్టోబర్ లో దసరా అయిపోవటంతో ఇప్పుడు అందరి దృష్టి దీపావళిపై పడింది. మరో రెండు, మూడు రోజుల్లో టపాసుల షాపులు కూడా ఓపెన్ కాబోతున్నాయి. సరిగ్గా టైంలోనే ఈ దీపావళికి ఎవరూ టపాసులు కాల్చొద్దని అసలు టపాసుల షాపులు పెట్టొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది ఢిల్లీ ప్రభుత్వం. ఈ దీపావళిని కొవ్వొత్తులతో సెలబ్రేట్ చేసుకోవాలని ఎవరూ టపాకాయలు కాల్చొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది అక్కడి ప్రభుత్వం. దీనికి కారణం

మిగతా 2 లో

# ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు రిజర్వేషన్లు

### ప్రకటించిన మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు మంత్రి సీతక్క. సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ఆవిష్కరించారు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క. అనంతరం మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరేట్ హెల్ప్ లైన్ లో పది మందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు

మిగతా 2 లో



## టికెట్స్ రేట్లు పెంచడం అవాస్తవం

### ఆర్టీసీ బస్సు సర్వీసుల టికెట్ల ధరలపై వివరణ

హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): బతుకమ్మ, దసరా నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో విపరీతంగా టికెట్ల ధరలు పెంచారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ టికెట్స్ రేట్లు పెంచడం అవాస్తవం అంటూ వివరణ ఇచ్చారు. 2003లో వచ్చిన జీవో 16 ప్రకారమే

మిగతా 2 లో

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో

# మరో ముందడుగు

### వేగంగా జరుగుతున్న చంద్రయాన్-4 అభివృద్ధి పనులు



చంద్రయాన్-4 మిషన్‌కి సంబంధించి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరో ముందడుగు పడింది. అంతరిక్ష పరిశోధనల్లో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే దిశగా ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థ స్పేస్ కిడ్జ్ ఇండియా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ఇస్రో చంద్రయాన్-4 మిషన్‌లో ప్రయోగించేలా ఉపగ్రహాన్ని తయారు చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ ఇచ్చేందుకు శక్తిశాట్ అనే మిషన్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 108 దేశాలకు చెందిన 12,000 మంది బాలికలకు అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికార పోస్టర్‌ను రాష్ట్రపతి

మిగతా 2 లో

## ప్రధాని హయాంలోనే ఆలయాల రూపురేఖలు మారుతున్నాయ్

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని అన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయ మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందరిలోనూ అవగాహన పెరిగిందని ఇప్పుడు యువత కూడా పెద్ద ఎత్తున ఆలయాలకు వస్తున్నారని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక

మిగతా 2 లో



## గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ

### రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులను విడుదల చేసింది. 92 నియోజకవర్గాల్లో 641 పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 323 కి.మీ మేర నూతన రహదారుల నిర్మాణ పనుల నిమిత్తం రూ.1377.66 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి మరిన్ని నిధులు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. సీఆర్ఆర్ రోడ్ల కోసం మరో రెండుమూడు రోజుల్లోనే రూ. 400 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.




## క్యాట్ ఆశ్రయించిన ఏపీ కేడర్ ఐఏఎస్‌లు

### తెలంగాణలోనే కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్లు

హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ఏపీ కేడర్ ఐఏఎస్‌లు క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్) ను ఆశ్రయించారు. తెలంగాణలోనే కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని సోమవారం పిటిషన్లు దాఖలు చేశారు. వాకాటి కరుణ, వాణీప్రసాద్, ఆమ్రపాలి, సృజనలు పిటిషన్లు దాఖలు చేశారు. డీఓపీటీ ఇచ్చిన ఉత్తర్వులను

మిగతా 2 లో



## స్కిల్ యూనివర్సిటీలో కొత్త కోర్సు పెట్టాలని కోరిన సినీ పరిశ్రమ

హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నెలలోనే అభ్యర్థులకు ఉపాధిని కల్పించే నాలుగు కోర్సులను ప్రారంభించనుంది. అయితే స్కిల్ యూనివర్సిటీలో ఇంకో కోర్సును కూడా పెట్టాలని తెరపైకి వచ్చింది. స్కిల్ యూనివర్సిటీలో

మిగతా 2 లో

## మంత్రి కొండా సురేఖ కోసం స్వామివారికి ఆలస్యంగా నైవేద్యం

### 30 నిమిషాలు ఆపేసిన నైవేద్య సమర్పణ

### మంత్రి సురేఖ, అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం వ్యక్తం



.. వివరాలు 2లో



## ప్రొ. సాయిబాబా భౌతిక కాయం వద్ద కేటీఆర్‌కు అవమానం

కేటీఆర్ గో బ్యాక్ అంటూ అడ్డుకున్న ఉద్యమకారులు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ కు తీవ్ర అవమానం జరిగింది. ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయానికి

మిగతా 2 లో

# ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తాం

మొదటి పేజీ తరువాయి



అవకాశాలు తక్కువ అన్నారు. అందుకే వాళ్లకి ఉపాధి కల్పించేందుకు ఆన్లైన్ జాబ్ పోర్టల్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. సంక్షేమ నిధుల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆన్లైన్ జాబ్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుంటే చాలు అని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. సంక్షేమం, విద్య, ఉద్యోగ రంగాల్లో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు మంత్రి సీతక్క.

# టపాసుల షాపులు పెట్టొద్దంటూ ఆదేశాలు జారీ

మొదటి పేజీ తరువాయి

లేకపోలేదు. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్యం విపరీతంగా పెరిగింది. సహజంగా దీపావళికి వారం రోజుల ముందు ఉంటే వాతావరణ పరిస్థితులు ఈసారి 15 రోజుల ముందే కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తున్న ఢిల్లీ వాయి కాలుష్యం అక్టోబర్ 14వ తేదీకే ఎక్కువ అయి-ంపోయింది. ఇలాంటి టైంలో దీపావళికి టపాసులు కాల్చినట్లయితే అసలు ఢిల్లీలో పీల్చుకోవటానికి గాలే ఉండదు. ఈ క్రమంలోనే 2025, జనవరి ఒకటో తేదీ వరకు ఢిల్లీలో టపాసులు తయారు చేయటం, నిల్వ చేయటం, అమ్మటంపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్. ఎవరైనా నిబంధనలు ఉల్లఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భారీ జరిమానా వేస్తామని వార్నింగ్ కూడా ఇచ్చారు మంత్రి రాయ్.

# టికెట్స్ రేట్లు పెంచడం అవాస్తవం



మొదటి పేజీ తరువాయి

స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలను సవరించామని పేర్కొన్నారు. రెగ్యులర్ సర్వీసుల టికెట్స్ లో ఎలాంటి పెంపు లేదని వెల్లడించారు. పండగ సమయాల్లో స్పెషల్ బస్సుల డీజిల్ ఖర్చుల మేరకు రేట్లు సవరించుకోవచ్చని, ఆ మేరకు కేవలం స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ పెంపు ఉందని అన్నారు. 8500 రెగ్యులర్ సర్వీసుల్లోని టికెట్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని, కేవలం దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని నడిపే 500 సర్వీసుల్లో మాత్రమే చార్జీల పెంపు ఉందని ప్రయాణికులు గమనించాలని కోరారు. కొందరు కావాలనే సంస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

# క్యాట్ ఆశ్రయించిన ఏపీ కేడర్ ఐఏఎస్‌లు

మొదటి పేజీ తరువాయి

రద్దు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తెలంగాణలోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి కోరగా ఏపీలోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని సృజన కోరారు. నలుగురు ఐఏఎస్‌లు వేరువేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. నేడు ఈ పిటిషన్లపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ విచారణ చేపట్టనున్నది. అంతకుముందు రాష్ట్ర సచివాలయం వేదికగా సీఎస్ శాంతికుమారితో నలుగురు ఐఏఎస్‌లు భేటీ అయ్యారు. సుదీర్ఘ చర్చల అనంతరం క్యాట్‌ను ఆశ్రయించారు.

# ప్రధాని హయాంలోనే ఆలయాల రూపురేఖలు మారుతున్నాయ్

మొదటి పేజీ తరువాయి

వాతావరణం పెరిగిందని చెప్పుకొచ్చారు. పెద్దలపై గౌరవం, దేశ భక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలని అన్నారు. మరింత అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వరంగల్లోని భద్రకాళి ఆలయాన్ని కూడా అద్భుతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారి విగ్రహ ధ్వంసానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రశాంతమైన హైదరాబాద్ నగరంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.అందులో భాగంగానే సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వసం చేశారని ఫైరయ్యారు.

# హైకోర్టు తలుపుతట్టిన మూసీ బాధితులు




హైదరాబాద్, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు బాధితులు సోమవారం హైకోర్టు తలుపుతట్టారు. మూసీ పరివాక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్నామని, ఇప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం తమ ఇళ్లు కూలగొట్టే అవకాశం ఉందని హైకోర్టులో పిటిషన్ వేశారు. అధికారులు తమ ఇళ్లపై మార్కింగ్ వేసిన విషయాన్ని వీరంతా హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తమ ఇళ్లు కూల్చకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో కోరారు. మంగళవారం హైకోర్టు ఈ పిటిషన్‌లను విచారించనుంది. కాగా, మూసీ సుందరీకరణ కోసం ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న ఇళ్ల కూల్చివేతను అధికారులు ఇప్పటికే ప్రారంభించారు.

# బీసీల కులగణనకు గ్రీన్ సిగ్నల్..

## గ్రామాల్లో పోటాపోటిగా ఫ్లెక్సీలు






మొదటి పేజీ తరువాయి

సర్కారు కులగణన సర్వేకు సంబంధించిన జీఓ 18ను జారీ చేసింది. ఫలితంగా లోకల్ బాడీస్ అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. ఇదే అవకాశమని భావించి, దసరా పండుగ రోజున తమ ఉనికిని చాటేందుకు పెద్ద ఎత్తున తమ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు. మరోవైపు బీసీ కులగణన లేకుండా గ్రామ పంచాయతీకి ఎన్నికలను నిర్వహించొద్దని ఓవైపు బీఆర్ఎస్, ఇంకోవైపు బీజేపీలు పట్టుబట్టాయి. ఇక బీసీ సంఘాలు అయితే రిజర్వేషన్లు తేలకుండా ఎన్నికల ప్రస్తావన తీసుకురాకూడదని అల్టిమేటం జారీ చేశాయి. ఒకదశలో బీసీ సంఘాలు హైకోర్టును సైతం ఆశ్రయించాయి. పిటిషన్లను విచారించిన ఉన్నత న్యాయస్థానం, బీసీ కులగణన చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం సూచనల మేరకు ప్రభుత్వం స్పందించింది. ఈ క్రమంలోనే కులగణన పూర్తైన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అసలు లోకల్ బాడీస్ అంటేనే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు. పల్లెల్లో కీలకమైన ఈ ఎన్నికలపై ఈసారి బీసీలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 4న జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని సైతం ప్రవేశపెట్టింది. ఇదే సమయంలో బీసీ కులగణనపై పలు రాష్ట్రాల్లోని స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం అధికారులను పంపించింది. ఈ సందర్భంగా అధ్యయనం వివరాలు ప్రభుత్వానికి అందడంతో కులగణనకు సర్కారు పచ్చజెండా ఇచ్చేసింది. కులగణన బాధ్యతను ప్రభుత్వం ప్రణాళిక శాఖ భూజంపై మోపింది. కులగణన పూర్తయ్యే వరకు ప్రణాళికా శాఖనే నోడల్ ఏజెన్సీగా బాధ్యతలు నిర్వర్తించనుంది. బీసీ కులగణనకు అధనంగా ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల కులాల సర్వేని చేపట్టాలని జీఓలో ప్రభుత్వం స్పష్టంగా వివరించింది. ఇక సామాజిక, ఆర్థికపరమైన స్థితిగతులే కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలపైనా సర్వే చేయాలని ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియను కేవలం 60 రోజుల్లోనే పూర్తి చేయాలని సదరు జీఓ ద్వారా చెప్పింది. సర్వేకు సంబంధించిన మార్గదర్శకాల కోసం అంతా ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతోనే సర్వే చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు ఒకటి, రెండు రోజులోనే వెలువడే అవకాశాలున్నాయని ప్రణాళిక సంఘం అధికారులు అంటున్నారు. అసెంబ్లీ ఓటర్ల జాబితాలను అనుసరించి గ్రామ పంచాయతీలు, వార్డుల లెక్కన గతనెల 29నాటికే ఫైనల్ జాబితాను సంసిద్ధం చేసింది.


ఓటర్ జాబితాలను సైతం రెఢీగా పెట్టారు. కుల గణన సర్వే వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయింది. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఖరారు చేశాకే ఎన్నికలను నిర్వహించనుంది ప్రభుత్వం. డిసెంబర్ నెలాఖరు వరకు ఈ సర్వే ప్రక్రియ పూర్తికానుంది.

ఈలోగా బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల స్థితిగతులపై ప్రభుత్వానికి ఓ అంచనా వస్తుంది. మొత్తం కులగణన సర్వే తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను ఖరారు అవుతుందని సమాచారం

# భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరో ముందడగు

మొదటి పేజీ తరువాయి

ద్రౌపదీ ముర్ము త్వరలో ఆవిష్కరించనున్నారు. ఈ శక్తిశాట్ మిషన్ ద్వారా 108 దేశాలకు చెందిన 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న 12,000 మంది హైస్కూల్ విద్యార్థినులకు స్పేస్ టెక్నాలజీ, పేలోడ్ అభివృద్ధి, వ్యోమనౌక వ్యవస్థల గురించి ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. బ్రిటన్, యూఏఈ, బ్రెజిల్, కెన్యా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, గ్రీస్, శ్రీలంక తదితర దేశాలు ఇందులో భాగస్వామ్యమవుతున్నాయి. శిక్షణ అనంతరం ప్రతి దేశం నుంచి ఒక విద్యార్థిని చొప్పున 108 మందిని ఎంపిక చేస్తారు. వీరికి పేలోడ్‌లు, స్పేస్‌క్రాఫ్ట్ ప్రోటోటైప్‌లను రూపొందించడంలో శిక్షణ ఇస్తారు. ఇస్రో చంద్రయాన్-4 మిషన్‌లో ఉపగ్రహాన్ని ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ ముందు మోడల్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ శక్తిశాట్ మిషన్ కేవలం మన దేశానికే కాకుండా మొత్తం ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చే సామర్థ్యం కలిగి ఉందని మిషన్‌కు నేతృత్వం వహిస్తున్న కేసన్ తెలిపారు. బాలికలను ప్రోత్సహించడం ద్వారా సాధికారతను కల్పించడం, జీవితాలను మార్చే అవకాశాలను అందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. స్పేస్ కిడ్జ్ ఇండియా ఇప్పటి వరకు 18కి పైగా బెలూన్ శాటిలైట్లు, 3 సబ్ ఆర్బిటల్ పేలోడ్‌లు, 4 ఆర్బిటల్ ఉపగ్రహాలను ప్రయోగించింది. హైస్కూల్, కాలేజీ విద్యార్థుల సాయంతో ఉపగ్రహాలను ప్రయోగించిన మొట్టమొదటి సంస్థగా గుర్తింపు పొందింది.



## స్కిల్ యూనివర్సిటీలో కొత్త కోర్సు పెట్టాలని కోరిన సినీ పరిశ్రమ

మొదటి పేజీ తరువాయి

యాక్టింగ్ కోర్సు పెట్టాలని తెలుగు సినీ నిర్మాతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి తో పాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల భరణి, సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశంపై భట్టి ఎక్స్ వేదికగా పలు విషయాలను పంచుకున్నారు. తెలంగాణ అంటేనే ఆట, పాట ఈ తెలంగాణ ఆట, పాటను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. తెలంగాణ సినీ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గౌరవిస్తుంది, ఈ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదగాలని కోరారు.

# మంత్రి కొండా సురేఖ కోసం "స్వామివారికి" ఆలస్యంగా నైవేద్యం



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మరో వివాదాస్పదమైన చర్యకు పాల్పడ్డారు. ఇప్పటికే వరుస దుందుడుకు చర్యలతో వార్తల్లో నిలుస్తున్న సురేఖ తాజాగా వేములవాడ రాజన్న సన్నిధిలో మ-రోసారి చర్చ. ఈ మేరకు సోమవారం స్వామివారిని కుటుంబసమేతంగా కొండా సురేఖ దర్శించుకోగా సురేఖ కోసం స్వామివారి నైవేద్యం చాలా సేపు ఆపేశారు ఆలయ అధికారులు. నిజానికి సోమవారం ద్వాదశి సందర్భంగా స్వామివారికి 3 గంటలకు నైవేద్యం సమర్పించాల్సి ఉండగా 30 నిమిషాలు ఆలస్యంగా నివేదన సమర్పించారు అర్చకులు. స్వామివారి నైవేద్యాన్ని ఆపి మరీ కొండా సురేఖకు కుటుంబానికి పూజలు నిర్వహించారు. దీంతో మంత్రి కొండా సురేఖతోపాటు అధికారుల తీరుపై భక్తుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవలే కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ మరో వివాదంలో చిక్కుకున్నారు. తన అనుచరులను అరెస్ట్ చేసినందుకు గీసుగొండ పోలీస్ స్టేషన్కు చేరుకుని నానా హంగామా చేశారు. ఏకంగా సీఐ కుర్చీలో కూర్చుని అరెస్ట్ చేసినవారిని విడిచిపెట్టాలంటూ హల్చల్ చేశారు. తన వర్గం కార్యకర్తలను ఎందుకు అరెస్ట్ చేశారంటూ దురుసుగా ప్రవర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కాగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.

## విడుదలైన గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు

మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన వెబ్ సైట్లో అందుబాటులో ఉంచింది. తెలంగాణ రాష్ట్రంలో 563 పోస్టు భర్తీకి సంబంధించి మెయిన్స్ పరీక్షల నిర్వహణ కోసం కమిషన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.ఇప్పటికే కొన్ని గైడ్ లైన్స్ ను సైతం విడుదల చేసింది. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://www.tspsc.gov.in ద్వారా హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చని కమిషన్ పేర్కొంది.

# ప్రొ. సాయిబాబా భౌతిక కాయం వద్ద కేటీఆర్ కు అవమానం

మొదటి పేజీ తరువాయి

నివాళులు అర్పించటానికి వచ్చిన కేటీఆర్ ను అడ్డుకున్నారు ఉద్యమకారులు, పౌరహక్కుల సంఘం నేతలు. కేటీఆర్ గో బ్యాక్.. కేటీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యమకారులు, పౌరహక్కుల నేతలపై ఉక్కుపాదం మోపిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపా వంటి తీవ్రమైన కేసులు పెట్ట జైళ్లల్లో పెట్టింది కేసీఆర్ ప్రభుత్వమే అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరాం, విమలక్క వంటి వారిపై కేసులు పెట్టించి, వేధించి జైళ్లకు పంపించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని అలాంటి కేటీఆర్ ఇప్పుడు సాయిబాబాకు ఎలా నివాళులు అర్పిస్తారంటూ ప్రశ్నించారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఉద్యమకారులు, హక్కుల నేతలు, కార్యకర్తలను తీవ్రంగా అణచివేసింది నిజం కాదా అంటూ ప్రశ్నించారు ఉద్యమ, హక్కుల కార్యకర్తలు. ఉద్యమకారుల ఆగ్రహంతో గో బ్యాక్ కేటీఆర్ అంటూ నినాదాలు చేస్తున్నా కేటీఆర్ మౌనంగా ఉన్నారు. నివాళులు అర్పించి మౌనంగా వెనుదిరిగారు. కనీసం సమాధానం కూడా చెప్పలేకపోయారు కేటీఆర్. తీవ్ర అవమానం, చేదు అనుభవంతో అక్కడి నుంచి వచ్చేశారు కేటీఆర్.



తీన్మార్
తెలుగు దినపత్రిక

# కమ్ముతున్న వాయు కాలుష్యం

శీతాకాలం సమీపిస్తుండటంతో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మళ్లీ వాయు కాలుష్యానికి స్వాగతం ఇస్తున్నాయి. గత నెల ప్రధాని కార్యాలయం ఈ రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఢిల్లీలో వాయు నాణ్యత క్షీణించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. వాహనాల కాలుష్యంతోపాటు, రోడ్లు, నిర్మాణాల దుమ్ముధూళి, ఘనవ్యర్థాల నిర్వహణ ఇవన్నీ గత కొన్నేళ్లుగా వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయని చర్చించారు. పంజాబ్, హర్యానాల్లో పంట వ్యర్థాలను మండించడం పెద్ద సమస్యగా తయారైంది. అక్టోబర్, నవంబర్ నెలలో కాలుష్యంలో 40% ఈ పంట వ్యర్థాలే కారణమవుతున్నాయి. ఈ ఏడాది పంజాబ్‌లో 19.52 మిలియన్ టన్నులు, హర్యానాలో 8 మిలియన్ టన్నుల వరి వ్యర్థాలను దగ్ధం చేస్తారని అంచనా. అయితే ఈ రెండు రాష్ట్రాలూ ఈ ఏడాది పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా నివారిస్తామని హామీ ఇచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు ఈ పంట వ్యర్థాల కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా పూర్తిగా నిలువరించాలని ఆదేశించింది. ఈ ఏడాది రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా కేంద్రం తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది. 2023 పంటకోతల సీజన్‌లో పంజాబ్‌లో పంట వ్యర్థాల దగ్ధం సంఘటనలు 2022 తో పోలిస్తే 59% తగ్గాయి. అలాగే హర్యానాలో 2023లో 40% తగ్గాయి. కానీ ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పంటవ్యర్థాల దగ్ధం సంఘటనలు 30% పెరగడం గమనార్హం. ఈ సమస్య నివారణకు ఆర్థిక రాయితీలు కల్పించడం, ఇతర చర్యలు తీసుకోవడం తప్పనిసరి. పంట వ్యర్థాలను 11.5 మిలియన్ టన్నుల వరకు దగ్ధం చేయకుండా పొలాల్లోనే వాటిని వినియోగించడం, మిగతా వ్యర్థాలను బయటకు తరలించడం చేస్తామని పంజాబ్ పేర్కొంది. దీంతో పాటు 2 మిలియన్ టన్నుల వరిగడ్డి వ్యర్థాలను ఎన్‌సిఆర్ రీజియన్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్లలో మండించడానికి వినియోగిస్తున్నారు. అంటే వరిగడ్డి వ్యర్థాలను గుళికలుగా తయారు చేసి కార్బన్ వనరుగా వినియోగిస్తుంటారు. అయితే దీనికి కావలసిన యంత్రాలు రైతులకు అందుబాటులో లేవు. విద్యుత్ ప్లాంట్లలో పంట వ్యర్థాలను వినియోగించడం ఒక పరిష్కార మార్గమే అయినప్పటికీ, పొలం నుంచి పవర్‌ప్లాంట్‌కు ఈ వరిగడ్డి గుళికలను రవాణా చేసే వ్యవస్థ లేదు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన విధానాలు పాటించకపోవడం రైతులకు నష్టాలకు దారితీస్తోంది. సీజన్‌లో రెండు పంటలు వేస్తేనే కానీ తమకు నష్టాలు తీరవన్న ఉద్దేశంతో రైతులు వరిగడ్డిని దగ్ధం చేసి గోధుమ పంట సాగుకు సమాయత్తం అవుతుంటారు. అదే పంట వ్యర్థాల దగ్ధానికి దోహదమవుతోంది. వరికి బదులుగా పెసర వంటి పప్పు ధాన్యాల సాగును చేపట్టినా గిట్టుబాటు ధర లభించడం లేదు. అందువల్ల చేసేది లేక వరిని సాగు చేయవలసి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరిగడ్డి దగ్ధం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యాల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయాలను పక్కనపెట్టి సమష్టిగా కృషి చేస్తేనే కానీ సత్ఫలితాలు రావు. ఢిల్లీలో గత ఏడాది రికార్డు స్థాయిలో వాయు నాణ్యతా ప్రమాణాలు పడిపోయాయి. మళ్లీ గత కొన్ని రోజులుగా వాయు నాణ్యత క్షీణిస్తోంది. గత మూడు నెలల్లో మొదటిసారి ఎక్యూఐ (వాయు నాణ్యత ప్రమాణాలు) 200 నుంచి 300 మధ్యకు చేరుకుంది. ఐక్యూఎయిర్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక కాలుష్య దేశాల్లో మన దేశం మూడో స్థానంలో ఉంది. దేశంలో సగటున క్యూబిక్ సెంటీమీటర్‌కు ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎం.పి) 2.5 మైక్రోగ్రామ్స్ గాను, గాఢత 54.4 మైక్రోగ్రామ్స్ గాను కొనసాగుతోంది. గాలిలో కాలుష్యానికి కారణమయ్యే వివిధ రకాల వాయువులు, రసాయనాల మిశ్రమాన్ని ఎంపిగా పేర్కొంటారు. వాయు కాలుష్యం కారణంగానే మన దేశంలో సగటున సంవత్సరానికి రూ. 2.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని నివేదికలు చెబుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఇది 1.36 శాతం. వాహనాల నుంచి పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, రసాయన వాయువులు, పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫర్‌డైయాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ కాలుష్యాలతో వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది. పంట వ్యర్థాలను దగ్ధం చేయడంతో శీతాకాలంలో ప్రజలకు శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అకాల మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ప్రస్తుతం వాయు నాణ్యత పిఎంను 2.5 కంటే తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యంలో కనీసం 20నుంచి 40 శాతం వరకైనా 2026 నాటికి సాధించవలసి ఉంది. ఈ మేరకు లక్ష్యాలను సాధించకపోతే ఢిల్లీలో ఎవరూ నివసించలేని దుర్భర పరిస్థితి దాపురిస్తుంది.

# నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్

- మచ్చలేని నాయకుడు రేవూరి ప్రకాష్ రెడ్డి
- విభజన రాజకీయాలు చేయని నాయకుడు
- మంత్రి కొండా సురేఖ సంయమనం పాటించాల్సింది
- కార్యకర్తల అందరి కృషితోనే కాంగ్రెస్ గెలుపు మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి



పరకాల, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల అసెంబ్లీ నియోజకవర్గానికి నాయకుడు ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి అని, ఆయనకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తల అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి అన్నారు. సోమవారం రోజున పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల అందరి కృషితోనే పరకాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని, అన్ని రకాలుగా అభివృద్ధిలో వెనుకబడిన పరకాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు గత పది నెలల కాలం నుండి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ధర్మారంలో జరిగిన దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఫోటో పెట్టకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అనిల్ పై దాడి చేయడం బాధాకరమని దీన్ని ఖండిస్తున్నాం అని తెలిపారు. నిన్న జరిగిన సంఘటనలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కార్యకర్తలకు నచ్చ చెప్పాల్సి ఉండేదని తెలిపారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేతో పాటు మంత్రి కొండా సురేఖ సహకారం కూడా అవసరం అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలను కొత్త ,పాత అనే తేడా లేకుండా అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని కార్యకర్తలను విభజించే వ్యక్తి కాదు అని తెలిపారు. ధర్మారం ఘటనను కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరుగా చూడొద్దని ఆయన కోరారు. రాజకీయ జీవితంలో రేవురి ప్రకాష్ రెడ్డిది మచ్చలేని చరిత్ర అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో ప్రతి కార్యకర్త కృషి ఉందని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన పది నెలల కాలంలో ఏనాడూ రేవూరి, కొండ, ఇనగాల వర్గమని ఎప్పుడు చూడని నాయకుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొలుగురి భిక్షపతితో పాటు నడికూడా మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఒంటేరు సారయ్య, పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, పోరండ్ల సంతోష్, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నాల గోనాద్, సోదా అనిత రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మడికొండ శ్రీనివాస్, నల్లెల అనిల్ కుమార్, మహిళా కమిటీ సభ్యులు లక్కం వసంత, గొట్టే రమేష్, సూదమల్ల కిషోర్, ఒంటెరు శ్రవణ్,పోరండ్ల వేణు, ఆలేటి రాజు, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా వాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### – జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిశిలించాలన్నారు. జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్ లతో కలిసి కలెక్టర్ ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు, ఏదైనా శాఖ పరమైన సమస్యలు ఉంటే వారికి కావలసిన సమాచారం గైడ్ చేయాలని సూచించారు. ఈ సోమవారం నాడు రెవెన్యూ శాఖకు సంబంధించి 22, పంచాయతీరాజ్ 3, ఎస్టీ వెల్ఫేర్ 3, మున్సిపల్2, సివిల్ సప్లై 2, వైద్య ఆరోగ్యశాఖ 2, బ్యాంకింగ్ 2, ఇలా తదితర విభాగాలకు చెందిన మొత్తం (46) దరఖాస్తులు ఈరోజు వచ్చాయని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు, డిసిఓ వెంకటేశ్వర్లు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జడ్పీసీఈవో నర్మద, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, ఏడి ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డిహెచ్ఓ మరియన్న, డిఏఓ విజయ నిర్మల, ఎల్డిఏం ఎస్ మూర్తి, వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, డిఎంసిఎస్ క్రిష్ణవేణి, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఆర్డీఓ కే. సత్య పాల్ రెడ్డి లతొ కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు.

వారం వారం వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా

రెవిన్యూ శాఖ – 3

పెన్షన్లు – 4

ఇందిరమ్మ ఇళ్ల – 2

ఇతర శాఖలకు సంబంధించినవి – 2, మొత్తం 11 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం అంశంపై శాఖలు, మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పెండింగ్లో ఉన్న సమస్యలు, వాటికి గల కారణాలు, పరిష్కరించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక వివరాలను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, డిసిఓ సర్దార్ సింగ్, డి ఈ ఓ పాణిని, డి పి ఓ దేవ్ రాజ్, డి డబ్లుఓ శిరీష, డిసి ఎస్ ఓ షా ఫైజుల్ హుస్సేనీ, డి ఎం డిసి ఎస్ ఓ రాం పతి, డి ఏ ఓ సురేష్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి




ములుగు, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నవంబర్ లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ సోమవారం ములుగుకు చేరుకుంది. క్రీడాజ్యోతి ర్యాలీకి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మాట్లాడుతూ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం త్వరలో జరగబోయే సీఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య లక్షమని అన్నారు. గ్రామీణ స్థాయి నుండి యువత పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అద్భుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు. మన జిల్లా నుండి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులు తయారు కావాలని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మన రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు అట్టహాసంగా సుమారు 500 మంది క్రీడా భిమానులతో క్రీడాజ్యోతి ర్యాలీ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు సాగింది. ములుగులో ర్యాలీ అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బయలుదేరి వెళ్లిన క్రీడాకారుల టార్చ్ ర్యాలీ. అంతకుముందు ములుగు మండలం ఇంచెర్ల గ్రామం ఎర్రి గట్టమ్మ వద్ద స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అనువైన 38 ఎకరాల స్థలాన్ని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. తొ కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, యువజన క్రీడల అధికారి తుల రవి, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, క్రీడాకారులు, యువతి, యువకులు, విద్యార్థి, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కప్ -2024 లో భాగంగా టార్చ్ రిలే ర్యాలీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి కప్పు 2024 లో భాగంగా ఎల్బీ స్టేడియం హైదరాబాద్ నుండి టార్చ్ రిలే ర్యాలీ అక్టోబర్ మూడవ తేదీ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ ర్యాలీ 33 జిల్లాలలో పర్యటిస్తూ ములుగు జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి మంగళవారం (15-10-2024) ప్రవేశించడం జరుగుతుంది. ఈ టార్చ్ ర్యాలీకి ఆహ్వానం పలుకుతూ మంగళవారం రోజున ఉదయం 6 గంటలకు కొత్తగూడెం సెంట్రల్ పార్క్ నుండి ప్రకాశం స్టేడియం వరకు టార్చ్ రిలే ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, పీఈటీలు, పీడీలు, అన్ని క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు, విద్యార్థులు, యువజన సంఘాలు, %చీఎఎ/చీం౦% విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ యొక్క ర్యాలీని విజయవంతం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

# నేడే నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు

ములుగు జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో డీఎస్సి 2024 ద్వారా నియామకం అయిన నూతన ఉపాధ్యాయులకు నేడు అనగా మంగళవారం రోజున ఉదయం గం. 10.30 నుండి పోస్టింగ్ (పాఠశాలల కేటాయింపు) కోసం కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి జి పాణిని తెలిపారు. ఇటీవల యల్ బి స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు రేపు తెలంగాణ మోడల్ స్కూల్ బండారుపల్లిలో ఒరిజినల్ నియామక పత్రం, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలని, వీరికి మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ ఉదయం 10.30 గంటల వరకు హాజరు కావాలని, అలాగే ఎస్జీటి లు మధ్యాహ్నం 12.00 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. కౌన్సెలింగ్ కి హాజరు కానీ వారికి మిగిలిపోయిన ఖాళీలలో పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వబడతాయని తెలిపారు. ఖాళీల వివరాలు మరియు మెరిట్ వివరాలు అన్ని కూడా జిల్లా విద్యాశాఖ కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం



### – సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి
### – కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ఉద్యోగులు, విద్యారంగం వంటి పలు సమస్యలపై విన్నపం

ఖమ్మం: ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల బకాయిలు, ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ విధానం, విద్యా రంగంలో ఉన్న సమస్యల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆదివారం ఖమ్మంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ్మినేని వీరభద్రం సానుకూలంగా స్పందించి తమ పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అయన్ను కలిసిన వారిలో.. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కుప్పిశెట్టి సురేష్, మానుకోట జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్య తదితరులు ఉన్నారు.

# భూపాలపల్లి జిల్లాకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతి


### ♦ ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే గండ్ర, జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లిలోని హనుమాన్ దేవాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన టార్చ్ ర్యాలీ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జెండా ఊపి క్రీడాకారుల టార్చ్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం జిల్లాకు వచ్చిన క్రీడాకారుల ర్యాలీ గురించి ఆయన మాట్లాడుతూ సీఎం కప్ గురించి గ్రామీణ ప్రాంత యువతకు అవగాహన కల్పించి, గ్రామీణ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, క్రికెట్, ఫుట్ బాల్ అంశాలలో ఈనెల 21వ తేదీ నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని మన జిల్లాకు క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అద్భుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు. మన జిల్లా నుండి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులు తయారు కావాలని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మన రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. క్రీడలపై అవగాహన కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్టోబర్ 3కె తేదీన హైదరాబాద్ రోజున ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వపరంగా క్రీడాకారులకు ఒక బస్సును ఏర్పాటు చేసి అన్ని జిల్లాలలో అవగాహన కొరకు తిరుగుతూ ఈ రోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సీఎం కప్పు కాగడా ర్యాలీ రావడం జరిగిందని అన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి గ్రామ మండల, జిల్లా స్థాయిలో జరగనున్న క్రీడా పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడా కారులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన వారికి సీఎం కప్పు అందించడం జరుగుతుంది కాబట్టి జిల్లాలోని క్రీడాకారులు సీఎం కప్పు క్రీడల్లో పాల్గొనేందుకు సన్నద్ధమై గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు దేశ స్థాయి వరకు పెరిగే విధంగా సీఎం కప్పు ద్వారా ప్రభుత్వపరంగా ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి యువత పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. భూపాలపల్లిలో ర్యాలీ అనంతరం ములుగు జిల్లాకు బయలుదేరి వెళ్లిన క్రీడాకారుల టార్చ్ ర్యాలీ. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి జైపాల్ నాయక్, డిఎస్పీసంపత్ రావు, సిఐ నరేష్ కుమార్,

నోడల్ అధికారి మధు, హకీంపేట స్పోర్ట్స్ అధికారి రతన్ కుమార్, డిఎస్పీ సంపత్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ పరిపాలన అధికారి ఏ ఎన్ గోకుల్, ఖమ్మం అట్లెటిక్ అకాడమీ కోచ్ ఎం.డి గౌస్, పిఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం



జనగామ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రజల అందించిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 17దరఖాస్తులను స్వీకరించారు. జనగామ మున్సిపల్ పరిధిలోని సాయి నగర్ కు చెందిన అల్ల అనిత తాను ఒంటరిగా జీవిస్తున్నానని, అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని దరఖాస్తు అందించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ కి చెందిన నర్సోజి తన దరఖాస్తు అందిస్తూ, నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని తనకు తెల్ల కార్డు మంజూరు చేయాలని, పెన్షన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు గిర్నిగడ్డకు చెందిన నిరుపేదలు ఆర్. కోటేశ్వర్, ఆర్. భాస్కర్ లు తాము రేకుల ఇంటిలో నివసిస్తున్నామని, ఇంటిపైన చింత చెట్టు కొమ్మలు ఉండటంతో కోతులు ఇబ్బందికి గురి చేస్తున్నాయని, తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా దరఖాస్తు అందించారు.

పట్టణంలోని మున్సిపల్ రోడ్డులో నివసిస్తున్న దివ్యాంగుడు పత్తిపాక దినేష్ తనకు 45 శాతం వికలాంగత్వంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని జీవనోపాధికి పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు ఇచ్చారు. అలాగే సాయి నగర్ కి చెందిన ఒంటరి మహిళ బండి లక్ష్మి తాను దరఖాస్తు అందిస్తూ తనకు భర్త లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నానని పెన్షన్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని చర్యలు తీసుకోవాలంటూ పలువురు దరఖాస్తులు అందించారు. ప్రజల నుండి వచ్చిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు జారీ చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ డే లో జడ్పీ సీఈవో సరిత, డి ఆర్ డి ఓ వసంత, జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పిటిషన్లు త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, ఆర్డిఓ కృష్ణవేణి , జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డిఆర్డిఓ పిడి కౌసల్య దేవి గార్లు పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడమైనది. ప్రజావాణికి మొత్తం 58 దరఖాస్తులు రాగా, వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కరించ గలిగిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, పరిష్కరించేందుకు వీలుగాని దరఖాస్తులను సంబంధిత దరఖాస్తుదారు లకు వివరించి చెప్పే ప్రయత్నం చేయాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణి వేదికగా భానోత్ వీరన్న, నెక్కొండ మండలం దరఖాస్తుదారుడు ధరణి కరెక్షన్ నిమిత్తం దరఖాస్తు రాగా, పరిష్కరించేందుకు ధరణి ఆపరేటర్ చక్రధరకి పురమాయించగా వారు వెంటనే పరిష్కరించడం జరిగింది. అందుకు దరఖాస్తుదారుడు జిల్లా కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ మొదటి వారం లోగా కాటన్, ప్యాడి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుట ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రారంభించుటకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో కంటే ఈ సారి రెండు రకాల ధాన్యాలను కొనుగోలు చేసేందుకు వేరు వేరు కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈరోజు జరిగిన ప్రజావాణిలో వివిధ సమస్యల పై వచ్చిన దరఖాస్తులలో ఎక్కువ మొత్తంగా రెవెన్యూ శాఖ కి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు అదేశించడమైనది. ఎంజీఎం, సికేయం, ఏనుమాముల మార్కెట్ యార్డులలో ఇంద్ర మహిళా క్యాంటీన్ ఏర్పాటుకి లీడ్ బ్యాంక్ మేనేజర్,జియం ఇండస్ట్రీస్, డిఆర్డిఓ పిడి గార్లబ్ సమన్వయంతో మహిళా సంఘాలకు చేయూతనిచ్చేదిశగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖిలావరంగల్, వరంగల్ తాసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ , కలెక్టరేట్ సూపరెంటెంట్ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ,మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల ను పరిశీలించి పరిష్కరించాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

**గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు**

– టేకులపల్లి మండలం పాను గోతు తండాకు చెందిన భూక్య మంగి w/o భూక్య బాలు ( వికలాంగుడు) మాకు సరైన ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ ప్రభుత్వం ఇల్లు కొరకు పెట్టే ఏ పథకానికి అయినా మమ్మల్ని మొదటి విడతలోనే అర్హులుగా ప్రకటించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం హౌసింగ్ శాఖకు ఎండార్స్ చేశారు.

– మణుగూరు విటల్ రావు నగర్ కు చెందిన రావుల కుమారస్వామి వికలాంగుడినైన నేను మణుగూరు మున్సిపాలిటీలో వాటర్ బిల్ కలెక్టర్ గా, వాల్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న నాకు మేజర్ ఆక్సిడెంట్ అయినందువల్ల విధులకు రాలేకపోయినాను. మొన్నటి వరకు నా ఉద్యోగం నాకు ఇస్తామని ఇప్పుడు కలెక్టర్ లేదా సబ్ కలెక్టర్ దగ్గర నుంచి లెటర్ తెస్తేనే నీ ఉద్యోగం ఇస్తామని కమిషనర్ గారు ఇబ్బంది పెడుతున్నారని కావున నా ఉద్యోగం నాకు ఇప్పించగలరని కోరుతూ చేసిన దరఖాస్తు ని పరిశీలించి తగు చర్య నిమిత్తం మణుగూరు మున్సిపల్ కమిషనర్ కు ఎండార్స్ చేశారు.

– బొల్లోరి గూడెం న్యూ పాల్వంచ మండలం కు చెందిన బొల్లి రవి గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్ అందడం లేదని మాకు ఫ్రీ కరెంట్ ఇప్పించగలరని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం విద్యుత్ శాఖకు కు ఎండార్స్ చేశారు.

– బూర్గంపాడు గ్రామానికి చెందిన గోనెల బ్రహ్మం 0.1600 కుంటలకు పాస్ బుక్కులో తప్పులను సరి చేయుటకు దరఖాస్తు చేసి ఉన్నానని దరఖాస్తు చేసుకొని మూడు నెలలు కావస్తున్న ఇంతవరకు ఎటువంటి పాస్ బుక్ సరి కాలేదని తాసిల్దార్ కార్యాలయంలో ఈ విషయం గురించి అడగగా కలెక్టర్ గారి కార్యాలయంలో ఉన్నదని నా యొక్క పాసుబుక్కులో త్వరితగతిన తప్పులను సరి చేపించి న్యాయం చేయగలరని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఈడియం కు ఎండార్స్ చేశారు.

– దేగల నాగమణి w/o సయ్యద్ రషీద్ ఇల్లందు మండలం సూదిమల్ల గ్రామం వారు కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ పనిచేస్తున్నామని, మా వృత్తికి అవసరమైన కుట్టు మిషన్ కొనుగోలుకు రుణ సహాయం కోసం చేసుకున్న దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఎస్సీ సంక్షేమ ఎండార్స్ చేయడం జరిగింది.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హనుమకొండ, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): వరంగల్ లోని భద్రకాళి అమ్మవారిని కేంద్ర బొగ్గు గనులు, మైన్స్ శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సోమవారం దర్శనం చేసుకున్నారు. భద్రకాళి అమ్మవారి దర్శనం కోసం వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆలయానికి వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అధికారులు ఘన స్వాగతం పలకగా, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు కేంద్రమంత్రికి ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆలయ పూజారులు ఆలయ వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషు భారతి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలు, మన ఊరు - మన బడి పనులు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు – మన బడి, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు, జిల్లా కలెక్టర్, సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గుర్తించబడి కొనసాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు, (438) అమ్మ ఆదర్శ పాఠశాలల, త్రాగు నీరు, సరఫరా, టాయిలెట్స్ , విద్యుత్ సరఫరా, మైనర్ రిపేర్స్, బాలికలకు ప్రత్యేక టాయిలెట్స్, పనులు, (315) మన ఊరు – మన బడి, క్రింద కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, గ్రీన్ చాక్ బోర్డు, టేబుల్స్, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి తదితర పనులలో పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని, సంబంధిత పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, టీజీ డబ్ల్యూఐసి, శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి, పనులను పూర్తి చేసి విద్యార్థిని, విద్యార్థులకు హ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించడం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో (ఇన్చార్జి) డిఈఓ శ్రీరాములు, ఈఈ పంచాయతీరాజ్, విద్యాసాగర్, ఈఈ ఆర్ అండ్ బి, భీమ్లా నాయక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, వీరభద్రం, ఈఈ టీజీ డబ్ల్యూఐసి, నరేందర్, సిపిఓ సుబ్బారావు, వెల్ఫేర్ ఆఫీసర్ వరలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం




హనుమకొండ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతులను అందజేశారు. ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ స్వీకరించారు. ప్రజల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 52 వినతులు ప్రజల నుండి అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలలో చెత్త నిర్వహణ సరిగా ఉండాలి

### మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ వీపీ గౌతమ్



జనగామ జిల్లా, అక్టోబర్ 14 (తీన్మార్ న్యూస్): సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్,డైరెక్టర్ వీపీ గౌతమ్ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి పట్టణంలోని డంపింగ్ యార్డ్, డిఆర్సి సెంటర్, రంగప్ప చెరువు, రెండు పడక గదులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండిఏ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ని ముందుగా పరిశీలించి చెత్త నిర్వహణ సరిగా ఉండాలని, సేకరించిన చెత్త ని ఎప్పటికప్పుడు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి చేసి దానిని తరలించాలన్నారు. డిఆర్సి సెంటర్ గురించి మాట్లాడుతూ పేరుకు పోయిన పొడి చెత్తను త్వరగా తరలించాలన్నారు. వర్మీ కంపోస్టు షెడ్ లోనే ఎరువు ను తయారు చేయాలన్నారు. రంగప్ప చెరువు ని సందర్శించి చెరువు అభివృద్ధి కైచేపట్టాలిసిన పనులకు సంబందించి ప్రతిపాదనలను పంపించాలన్నారు చివరగా చాకలి ఐలమ్మ నగర్, మూడవ విడత ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ కాలనీ లో నిర్మిస్తున్న రెండు పడకల గదులను పరిశీలించి నిధులకు కొరత లేదని ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ జమున, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఫ్లోర్ లీడర్ కళ్యాణి, సంబందించిత ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి..

**- తండ్రి ఆత్మహత్య**
**- పండుగపూట విషాదం**
**- కుటుంబ కలహాలతోనే..?..కామారెడ్డి జిల్లాలో ఘటన**




తాడ్వాయి(లింగంపేట్): కలహాలు.. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. అభం శుభం ఎరగని పిల్లలను బావిలోకి తోసి తండ్రి సైతం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పండుగ వేళ.. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మబాద్ మండలం నారుగావ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(37).. తాడ్వాయి మండలం నందివాడకు చెందిన అపర్ణను పదేండ్ల క్రితం పెండ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు కొడుకులు విగేష్ (6), అరవింద్ (4) ఉన్నారు. కాగా దసరా వేడుకల్లో భాగంగా బంగారం (జమ్మి ఆకు) పంచుతానని శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో పిల్లలను తీసుకొని బయటకు వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం గ్రామసమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వచ్చి చూడగా.. విగేష్, అరవింద్‌గా గుర్తించారు. కాగా శ్రీనివాస్‌రెడ్డికి చెందిన సెల్‌ఫోన్, చెప్పులు బావి వద్దనే ఉండటంతో ఆయన కూడా బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావించి బావిలోని నీటిని పోలీసులు తోడించడంతో అతని మృతదేహం లభ్యమైంది. కాగా కుటుంబ కలహాలతోనే తన ఇద్దరు కొడుకులను బావిలోకి తోసి ఆయన కూడా ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, తాడ్వాయి ఎస్ఐ, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డబ్బుల విషయంలో గొడవలు..?

డబ్బుల విషయంలో కొన్ని రోజులుగా అత్తమామతో పాటు భార్యతో గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. వీరి కుటుంబానికి పది ఎకరాల భూమితో పాటు బర్రెలు ఉన్నాయి. అటు వ్యవసాయంతో పాటు ఇటు పశువులను చూసుకుంటూ జీవిస్తున్నారు. ఇల్లరికం వచ్చిన తనను విస్మరిస్తున్నారని, డబ్బులు ఇవ్వడం లేదని పలువురి వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై తన పిల్లలను తీసుకెళ్లి వారిని బావిలోకి తోసి తాను ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

# వర్గాలకు ఆజ్యం పోయొద్దు..

**- వర్గాలు లేవు.. అంతా ఒకటే వర్గం..**
**- గతంలో కూడా కార్యకర్తలపై కేసులు అయ్యాయి..**



గీసుగొండ: స్వంత మండలం అంటూ వర్గాలను లేపుతూ వర్గాలకు ఆజ్యం పోయడం మంత్రి గారికి తగదు, ప్రజా సమస్యలపై కృషి చెయ్యండి అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగాని సౌజన్య అన్నారు. ఆదివారం ఫ్లెక్సీల తగాదాలలో మంత్రి కొండ సురేఖ గీసుకొండ పోలీస్ స్టేషన్ సందర్శించడం పై సోమవారం మండల కేంద్రంలో తుమ్మనపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి సౌజన్య, మండల నాయకులు వీరగోని రాజు కుమార్ మాట్లాడుతూ.. గతంలో కూడా కార్యకర్తలపై కేసులు అయ్యాయని అప్పుడు మంత్రి కనపడలేదని అన్నారు. దెబ్బలు తాకిన బాధితున్ని పరామర్శించకుండా,కొట్టిన వారి కోసం స్వయంగా స్టేషన్ కు వచ్చి బయటికి తీసుకు వచ్చే ప్రయత్న చెయ్యడం సబబు కాదని అన్నారు. స్వంత మండలాన్ని అభివృద్ధి చెయ్యండి కానీ భ్రష్టు పట్టించే పనులు చెయ్యొద్దని అన్నారు. వర్గాల ఏర్పాటు ప్రక్రియ ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ బలోపేతం అయ్యే అవకాశం వుందని అన్నారు.గతంలో మీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డాం అని గుర్తు చేశారు.పరకాల లో రేవూరి కి టిక్కెట్ రావడంతో వారి గెలుపుకోసం కష్టపడి వారిని గెలిపించుకున్నామని అన్నారు. రేవూరి ఎమ్మెల్యే గా వుండటం వలన ప్రతి కార్యకర్త ధైర్యంగా వారి యొక్క పనులు చేసుకుంటున్నారు.కొట్టివారు,గాయ పడినవారు కాంగ్రెస్ కార్యకర్తలేనని, పార్టీ అధిష్ఠానం ఇది గమనించి సమన్వయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల అధికార చాడ కొమురారెడ్డీ,మండల ప్రధాన కార్యదర్శి కూసం రమేష్,మండల నాయకులు మరెడ్డి,యుత్ అధ్యక్షుడు రుద్ర ప్రసాద్,మధాసి రాంబాబు,గోపాల్ , పతిపాక రవీందర్, డివిజన్ నాయకులు దూపాకి సంతోష్,కేదాసీ మోహన్,దశారపు సారయ్య, మాజీ సర్పంచులు కవిత,బాబు,గోనె మల్లారెడ్డి, కుమారస్వామి, కునమల్ల అనిల్ , వంచనగిరి మాజీ ఎంపిటిసి సారంగం తదితరులు పాల్గొన్నారు.

# జానీ మాస్టర్ కి మరో షాక్?



జానీ మాస్టర్ కి మరో షాక్ తగిలింది. తెలుగులో టాప్ కొరియోగ్రాఫర్ గా కొనసాగుతున్న జానీ మాస్టర్ మీద గతంలో ఆయన వద్ద పనిచేసిన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఒకరు రేప్ కేసు పెట్టింది.

తాను మైనర్ గా ఉన్నప్పుడే తనను బలవంతం చేశాదని ముంబైలో రేప్ చేశాడని కేసు పెట్టడంతో జానీ మాస్టర్ మీద ఫోక్సో చట్టం సహా పలు రేప్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయనని ప్రస్తుతం అరెస్టు చేసి హైదరాబాద్ చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంచారు. ఇక జానీ ఈ కేసులో బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఆయన బెయిలు తిరస్కరించింది.. ఆయనకు రంగారెడ్డి కోర్టులో చుక్క ఎదురయింది జానీ మాస్టర్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ను కోర్టు కొట్టేసింది. నిజానికి గతంలో తాను నేషనల్ అవార్డు అందుకోవాల్సి ఉందని బెయిల్ కోసం అప్లై చేయగా ఆయనకు బెయిల్ మంజూరు అయింది. అయితే నేషనల్ అవార్డు రద్దు కావడంతో ఆయన బెయిల్ కూడా రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కేసులో సాధారణ బెయిల్ ఇవ్వాలని ఆయన కోరగా కోర్టు అందుకు అంగీకరించలేదు

# ధాన్యం సేకరణపై కంట్రోల్ రూమ్ బాగా పనిచేయాలి


**- సమస్యపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు: కలెక్టర్ నారాయణ రెడ్డి**



నల్గొండ కలెక్టరేట్: ఈ వానాకాలం ధాన్యం సేకరణ పై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన వానకాలం ధాన్యం సేకరణ కు సంబంధించి సమాచారం, ఫిర్యాదుల స్వీకరణకు ఉద్దేశించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోలు లో ఏవైనా సమస్యలు తలెత్తిన రైతులు లేదా ఇతరులు ఈ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన, 24 గంటలు పని చేసే ఫోన్ నెంబర్ 9963407064 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటలకు పని చేసే విధంగా రెండు విడతలలో విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించడం జరిగిందని, ఈ కంట్రోల్ రూమ్ లో వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సిబ్బంది పని చేస్తారని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఏర్పడిన, లేదా ఎక్కడైనా ధాన్యం కొనుగోలు జరగకపోయినా వెంటనే కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి తెలియజేయవచ్చని, సంబంధిత అధికారులతో ఆ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.అదేవిధంగా రాష్ట్రస్థాయిలో సైతం ధాన్యం సేకరణ,కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1 9 6 7 లేదా 180042500333 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం

**- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి**
**- కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ఉద్యోగులు, విద్యారంగం వంటి పలు సమస్యలపై విన్నపం**



ఖమ్మం: ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల బకాయిలు, ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ విధానం, విద్యా రంగంలో ఉన్న సమస్యల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆదివారం ఖమ్మంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ్మినేని వీరభద్రం సానుకూలంగా స్పందించి తమ పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అయన్ను కలిసిన వారిలో.. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కుప్పిశెట్టి సురేష్, మానుకోట జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్య తదితరులు ఉన్నారు.

# మద్దతు ధరతో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు..

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**
**- వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం**




బెజ్జంకి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో వరిధాన్యం కొనుగోళ్లు చేపట్టిందని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మండల కేంద్రంతో పాటు తోటపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులయందు పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ ఏఎంసీ చైర్మన్ పులి క్రిష్ణ,పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావుతో కలిసి ప్రారంభించారు. తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ రెడ్డి,ఒగ్గు దామోదర్, ఏఎంసీ, పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు,రైతులు హాజరయ్యారు.

# తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

**తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడి**
**ఆదిలాబాద్ మంచిర్యాల, ములుగు సహా పలు జిల్లాల్లో వర్షాలు**
**పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు**




తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 14వ తేదీన ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.

15వ తేదీన... నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. 16వ తేదీన... ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 17వ తేదీన... ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వెల్లడించింది. 18వ తేదీన ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వెల్లడించింది.

# ఆయిల్ ఫాం పరిశ్రమ అనుబంధ విద్యుత్ కేంద్రం ప్రారంభం

**- హాజరైన తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు**



అశ్వారావుపేట: టీజీ ఆయిల్ ఫెడ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్ ఫాం పరిశ్రమ అనుబంధంగా రూ.36 కోట్లు వ్యయంతో నిర్మించిన 2.5 మెగావాట్ల బయోమాస్ విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవం విజయవంతంగా ముగిసింది. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవానికి తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఫైనాన్స్, ప్లానింగ్, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించి ఆయిల్ ఫెడ్ కు అంకితం చేసారు. ఈ కార్యక్రమానికి రెవిన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎం.పి పోరిక బలరాం నాయక్, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్, కూనంనేని సాంబశివరావు,జారే ఆదినారాయణ, మట్ట రాగ మయి, ఆయిల్ ఫెడ్, నీటిపారుదల అభివృద్ధి, వేర్ హౌస్, మార్క్ ఫెడ్ కార్పోరేషన్ల చైర్మన్లు జంగా రాఘవరెడ్డి, మువ్వా విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు, కొత్వాల శ్రీనివాసరావులు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కార్యదర్శి, ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యస్మీన్ భాషా, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్.పీ రోహిత్ రాజు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు బాబూరావు, మధుసూధన్ రావు, జే.కిషోర్(ఇంచార్జి),ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ లు మేనేజర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ పి.తిరుమలేశ్వర్ రెడ్డి, పీ అండ్ పీ మేనేజర్ జున్ను సత్యనారాయణ, అశ్వారావుపేట పరిశ్రమ మేనేజర్ (టెక్నికల్) ఎం.నాగబాబు, డీవో, మేనేజర్ (టెక్) ఎ.బాలక్రిష్ణ, రిసోర్స్ పర్సన్ బి.రాజ శేఖర్ రెడ్డి, అప్పారావు పేట పరిశ్రమ మేనేజర్ (టెక్నికల్) జి. కళ్యాణ్ గౌడ్, డిప్యూటీ మేనేజర్ బి.వెంకటేష్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ ఎన్.రాధాకృష్ణ, కె. పవన్ కుమార్, ఫోర్ మెన్ కె. గోపాల కృష్ణ, ఆపరేటర్ కె.కమలాకర్ లు పాల్గొన్నారు.

# సన్న వడ్లకు కష్టకాలం...

మహబూబ్ నగర్: వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతిక అందుబాటులోకి వస్తున్నా వాటి పట్ల రైతుల్లో అవగాహణ కల్పించటంలోనే తగిన వేగం అందుకోలేక అధికార యంత్రాగం ఆవసోపాలు పడుతోంది. ప్రభుత్వం ఆశించిన ఫలితాలు అందించటంలో వెనుకబడుతోంది. రాష్ట్రంలో తొలిసారి ధాన్యం గింజల కొలతల ప్రక్రియ రైతుల్లో భయాలను పుట్టిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నేలల స్వభావం ,వాతావరణం తదితర అంశాల వల్ల ధాన్యం గింజ సైజులో కొద్దిగా మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయని , అటువంటి రకాలను సన్నధాన్యంగా గుర్తించకపోతే నష్టపోతామన్న సందేహాలు రైతులనుంచి వ్యక్తమవుతున్నాయి.బియ్యం గింజల కొలతల ప్రక్రియ పట్ల వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖలకు చెందిన వాటిలో ఏవి ఇంతవరకూ రైతుల్లో సరైన అవగాహన కల్పించలేకపోయాయి. రాష్ట్ర వ్యవసాయరంగం చరిత్రలో ఇప్పటివరకూ ధాన్యానికి కనీస మద్దతు ధరలు ..వాటి గ్రేడ్‌లను బట్టి నిర్ణయిస్తూ వచ్చారు. ఏగ్రేడ్ ,కామన్ గ్రేడ్ రకాలుగానే ధాన్యాన్ని ప్రభుత్వం సేకరిస్తూ వస్తోంది. ఏ గ్రేడ్ రకానికి కామన్ గ్రేడ్ కంటే 20రూపాయల మేరకు అధికంగా ధర చెల్లించేవారు. ఇక సన్నరకం ధాన్యం అయినా , దొడ్డు రకం ధాన్యం అయితే ఇదే గ్రేడ్‌ల కిందే కొనుగోలు జరిగేవి.సన్నరకం ధాన్యం అధికంగా ప్రైవేటు వ్యాపారులే కాస్తో కూస్తో అధికంగా ధర చెల్లించి కొనుగోలు చేస్తుండటంలో ఈ రకం ధాన్యం కూడా ధాన్యం సేకరణ కేంద్రాలకు తక్కువగానే వచ్చేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సన్నరకాల వరిసాగును ప్రొత్సహిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సన్నరకాలు పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, కామన్ రకాలకు రూ.2300 ధరను ప్రకటించింది.కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇదే ధరలతో కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బిపిటి ,ఆర్ఎన్ఆర్, 15048, హెచ్ఎంటిసోనా , జై శ్రీరాం తదితర 33వరిరకాలను సన్నరకం ధాన్యాలుగా గుర్తించి ఆ మేరకు ఈ రకాలకు మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ ప్రకటించింది.చిన్న చిన్న వస్తువుల కొలతలు నిర్ధారించే కాలిపర్స్ సాయంతో సన్నధాన్యం గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.గ్రెయిన్ కాలిపర్స్ ద్వారా ఈ కొలతలను నిర్వహించనున్నారు. రైతులు బస్తాల్లో తెచ్చిన ధాన్యం నుంచి పరీక్ష నిమిత్తం పది గింజలను తీసుకుంటారు .ఈ గింజల పొట్టు తీసిన తర్వాత బియ్యం గింజను గ్రేయిన్ కాలిఫర్స్ సాయంతో కొలత వేస్తారు .గింజ పొడవు 6 మిల్లీమీటర్లు మించరాదు. అదే విధంగా గింజ వెడల్పు 2మి.మి మించకుండా ఉంటే వాటిని సన్నరకంగా పరిగణిస్తారు. బియ్యం గింజ పొడవు వెడల్పు నిష్పత్తి 2.5 కటే ఎక్కువ ఉంటే వాటికి ప్రాధాన్యత ఇస్తారు. బియ్యంలో తేమ కూడా 17శాతం లోపే ఉండాలి. ఈ పరీక్షలకు నిలిచిన ధాన్యం మాత్రమే సన్నరకంగా ఎంపిక చేసి వాటికి మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ కలిపి మొత్తం రూ.2820 ప్రభుత్వం ఆ రైతుకు చెందిన బ్యాంకు ఖాతాకే నిధులు జమ చేస్తుంది.తొలిసారి సన్న రకం ధాన్యం సేకరణను ప్రభుత్వం ప్రత్యేకంగా చేపడుతుండటంతో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతై వాటిని వెంటనే పరిష్కరించేందకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. మండల స్థాయిలో కమిటీలను నియమించింది. తాసిల్దార్ , ఎంపిడివో, ఎస్ఐ, ఏఈవో, ఐకెపి ఎపిఎంవో, పిఏసిఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మెప్మా సిఈవోలను ఈ కమిటీల్లో సభ్యులుగా నియమించింది. ఈ కమిటిలకు ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో అవగాహణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్ కింద అన్ని రకాల పంటలు కలిపి మొత్తం కోటి 29లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. ఇందులో 65.49లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చింది. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతుల పంట పొలాలు పరిశీలించింది. రైతు పేరు, అధార్ నెంబర్, పొలం సర్వే నెంబర్ , సాగు చేసిన పంట, పంటలో విత్తన రకం ,విస్తీర్ణం తదితర అంశాలను ఈ క్రాప్ పోర్టల్ ద్వారా నమోదు చేశారు. రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు, వ్యవసాయ మార్కెట్లకు తీసుకుని వేళితే ముందుగా వ్యవసాయాశాఖ అధికారుల ద్వారా ఈ క్రాప్ ధృవీకరణ పత్రం తీసుకోవాలి.అందులో ఆ రైతు పంటకు సబంధించిన అన్ని వివరాలు పొందు పరిచి ఉంటాయి. ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యంలో 91లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసింది. అందులో 50లక్షల టనులు సన్నరకం ధాన్యమే వస్తుందని అంచనా వేసి ఆమేరకు కొనుగోలు ప్రణాళికలను సిద్దం చేసింది. ధాన్యం నుంచి గింజలను తీసి శాంపిల్ కింద బియ్యం గింజలను కొలిచే క్రమంలో ఈ క్రాప్ ధృవీకరణ పత్రం కూడా ప్రామాణికంగా మారనుంది. రైతులు తాము పండించిన ధాన్యం శాంపిళ్ల పరీక్షలో తేడాలు వస్తే ఒకటికి నాలుగు సార్లు ధాన్యం గింజలను పరీక్షకు పెట్టి ఈ క్రాప్ పత్రాన్నికూడా ఆధారంగా చూపాలని అధికారులు సూచిస్తున్నారు.

# దసరా పోయింది... దీపావళికైనా...

నిజామాబాద్: సార్ మంత్రి అవుదామనుకుంటున్నా. ఆగవయా నువ్వొకడివి. అసలే అధిష్టానం ఒప్పుకుంట లేదు. సార్ ఇప్పుడేమైంది. మంచిరోజులు లేవయా బాబు. సార్ దసరా వచ్చేసింది. మనం అధికారంలోకి వచ్చి కూడా ఏడాది కాబోతుంది. అమాత్య అదృష్టం ఎప్పుడు. అమాస అడ్డమొస్తుంది. దీపావళి అయిపోని అధిష్టానం ఒప్పుకుంటే అప్పుడు చూద్దాం. అవునా సార్.. ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు. మేము ఈశ్వర్‌కి శపథ్ లేతాహు అని అనేదెప్పుడు అని నిరుత్సాహంలో ఉన్నారట ఆశావాహులు. అమాత్య పదవి రేసులో ఉన్నోళ్లు ఓవైపు డ్రీమ్స్‌లో.. మరోవైపు డైలమాలో ఉన్నారట.సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి వాళ్లలో ఆశలు చిగురిస్తుంటాయ్. ఆయన హస్తిన నుంచి వచ్చాక గుడ్ న్యూస్ ఏం లేదని తెలిసి.. సల్లబడిపోతారు. ఇట్ల ఐదారు సార్లు ఎదురుచూసి..ఎప్పుడైతే గప్పుడాయని..విస్తరణ జరిగితే మాత్రం బెర్త్ దక్కేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారట. అయితే దసరా పండుగ మరోసారి ఆశావాహుల్లో ఆశలు రేపింది. కానీ ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదన్న సంకేతాలు ఇచ్చిందట అధిష్టానం. దీంతో దీపావళి తర్వాతే క్యాబినెట్ ఎక్స్ పాన్షన్ ఉంటుందన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. ఇంకేముంది అమాత్య బెర్తులు ఆశిస్తున్న వారంతా ఒక్కసారిగా నీరుగాపోయారని తెలుస్తోంది.మంత్రి వర్గ విస్తరణపై చాలామంది ఎమ్మెల్యేలు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఈసారి తమకు మంత్రి పదవి దక్కడం ఖాయమని తమ అనుచరులతో దీమాగా చెప్తున్నారట. కొంతమంది ఎమ్మెల్యేలు అయితే తమకు అనుకూలంగా మీడియాలో పెద్ద ప్రచారం కూడా చేయించుకుంటున్నారట.సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి.. తమకు మంత్రి పదవి ఖాయమన్నట్లుగా ఫీలవుతున్నారట. సీఎం ఢిల్లీ టూర్ అప్డేట్స్‌పై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా అని సమాచారం తెలుసుకుంటున్నారట. ఇలా రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న నేతల పరిస్థితి ఇలానే ఉంటోంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లడం, ఎమ్మెల్యేలు ఎదురుచూసి సల్లబడిపోవడం కామన్ అయిపోయింది.మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తున్నా.. ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదన్న చర్చ జరుగుతోంది. అనుకూలంగా ఉన్న వర్గాల ద్వారా ఢిల్లీ పెద్దలతో రాయబారం నడుపుతున్నారట. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డితో టచ్ లో ఉంటూనే మరోవైపు ఢిల్లీ పెద్దలను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రివర్గంలో ఈ సారి ఎలాగైనా తమ పేరు ఉండాల్సిందేనని కొందరు సీనియర్లు పట్టుదలతో ఉన్నారట.అయితే ఈ మధ్య ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డికి.. దీపావళి తర్వాతే క్యాబినెట్ విస్తరణపై ఆలోచిస్తామని ఏఐసీసీ పెద్దలు సంకేతాలిచ్చినట్లు టాక్. ఈ విషయం తెలిసిన ఆశావాహులంతా నిరాశకు గురైనట్లు పార్టీవర్గాలు చర్చించుకుంటు న్నాయి. అసలు మంత్రివర్గ విస్తరణ ఆలస్యం కావడానికి కారణాలు ఏమై ఉంటాయన్నది కాంగ్రెస్ నేతలెవ్వరికి అంతుపట్టడం లేదు. ఎందుకు కాంగ్రెస్ అధిష్టానం క్యాబినెట్ ఎక్స్‌పాన్షన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంలేదని తలలు పట్టుకుంటున్నారట. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే అధిష్టానం పెద్దలతో పలు మార్లు సంప్రదిం పులు జరిపినా ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ఆవేదన చెందుతు న్నారట.ఇక ఇప్పుడు దీపావళి పండగ తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న సమాచారంతో మళ్లీ యథావిధిగా ఎవరి స్థాయిలో వాళ్లుమంత్రివర్గంలో చోటు కోసం లాబీయింగ్ మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటిపో యింది. డిసెంబర్ వస్తే ఏడాది అవుతుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటవుతుందనే మాట వినిపించినా అది కార్యరూపం దాల్చలేదు.మూడు నెలలుగా మంత్రివర్గ విస్తరణపై ఎన్నో ఊహాగానాలు కొనసాగుతున్నాయి. శ్రావణ మాసం అయి పోయింది. దసరా కూడా గడిచిపోయింది. ఇక దీపావళికి అయినా అమాత్య ఆశలు నెరవేరుతాయా లేదా అన్నది డౌట్‌గానే ఉందన్న చర్చ జరుగుతోంది.

# అంతా ఆయన వల్లే...

హైదరాబాద్: ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కాటా ఆమ్రపాలి, వాణి ప్రసాద్, ప్రశాంతి, రోనాల్డ్ రాస్, ఐపీఎస్ అధికారులు అంజనికుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి ఆంధ్రప్రదేశ్ కేడర్ అధికారులుగా కొనసాగుతున్నారు. వీరు వెంటనే రిలీవ్ కావాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇక తెలంగాణ కేడర్ కు చెందిన ఐఏఎస్ అధికారులు శ్రీజన, హరి కిరణ్, శివశంకర్ ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్నారు. అయితే వీరంతా తమ క్యాడర్ మార్చాలని గతంలో కేంద్రంలోని అంతర్గత వ్యవహారాల శాఖకు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తు దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉంది. అయితే దీనిపై వెంటనే తుది నిర్ణయం తీసుకోవాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది.. ఈ క్రమంలో దీపక్ కండేకర్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్ ను ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు ఈ ఏడాది జూలైలో ఢిల్లీ వెళ్లారు. తాము క్యాడర్ మార్పు కోరుకుంటున్న నేపథ్యంలో? కమిషన్ ఎదుట తమ వాదనలు వినిపించారు. వారు చేసిన ప్రతిపాదనలను కమిషన్ తిరస్కరించిందని తెలుస్తోంది. అందువల్లే తాము లేఖలు పంపించామని కేంద్రం వెల్లడించింది. రిలీవ్ కావలసిన అధికారులు ఈనెల 16 లోగా.. వారికి బదిలీ జరిగిన రాష్ట్రాలలో రిపోర్ట్ చేయాలి. కొంతమంది ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు తెలంగాణలో పనిచేస్తుండగా.. వారు ఆంధ్రప్రదేశ్ వెళ్ళడానికి ఆసక్తి చూపించడం లేదు. వారు తమకు ఉన్న రాజకీయ పలుకుబడితో తెలంగాణ రాష్ట్రంలోనే పనిచేయడానికి మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోందిరాష్ట్ర విభజన సమయంలో ఆల్ ఇండియా స్టేట్ సర్వీస్ అధికారులకు కేంద్రం పక్క రాష్ట్రంలో పనిచేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే వారంతా కూడా తెలంగాణలో పనిచేస్తున్నారు. కొంతమంది తెలంగాణ కేడర్ అధికారులు ఆంధ్రలో పనిచేస్తున్నారు. అయితే వీరంతా కూడా 16 లోపు సొంత కేడర్ రాష్ట్రంలో చేరిపోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రకారం ఆమ్రపాలి, రోనాల్డ్ రాస్, ప్రశాంతి, వాణి ప్రసాద్, వాకాటి కరుణ, ఐపీఎస్ కు అంజని కుమార్, అభిలాష ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి పనిచేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణకు కేటాయించినప్పటికీ కొంతమంది అధికారులు ఆంధ్రప్రదేశ్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందులో 2013 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన సృజన విజయవాడ కలెక్టర్ గా పనిచేస్తున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన శివశంకర్ కడప కలెక్టర్ గా పని చేస్తున్నారు. 2009 హరి కిరణ్ ఏపీ ప్రజారోగ్య శాఖ సంచాలకుడిగా పనిచేస్తున్నారు.. 2010 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ఆమ్రపాలి కాట గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్నారు. 1995 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన వాణి ప్రసాద్ అటవీశాఖ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 2004 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన వాకాటి కరుణ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో సెక్రటరీగా పనిచేస్తున్నారు. అయితే తెలంగాణ కేడర్ కు తమను కేటాయించాలని ఏపీకేడర్ ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు రావత్, అనంతరామ్ ను విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించింది. దసరా అనంతరం ఆలిండియా సర్వీస్ అధికారులను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేస్తుందని సమాచారం.

# అనుమతి లేని పోలీసు సైరన్ పై చర్యలు

సిద్దిపేట: ప్రభుత్వ అనుమతి లేకుండా జిల్లాలో కొంతమంది వ్యక్తులు ప్రజా ప్రతినిధులు వారి సొంత వాహనాలకు పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైరన్స్ తీసివేయడం జరిగింది.. ప్రభుత్వ అనుమతి సొంత వాహనాలకు పోలీస్ సైరన్ బిగించవద్దు. అనుమతి లేకుండా సైరన్ బిగించిన వాహన యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. జిల్లాలో కొంతమంది రాజకీయ నాయకులు ప్రజా ప్రతినిధులు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా వారి యొక్క సొంత వాహనాలకు పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకుని వాహనాలు నడుపుతున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు సిబ్బంది అట్టి వాహనాలను గుర్తించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది స్పెషల్ డ్రైవ్ లో పోలీస్ సైరన్ 22 తీసివేయడం జరిగింది. ఇంకా కొన్ని వాహనాలకు ఉన్నట్లు సమాచారం ఉంది సంబంధిత వాహన యజమానులు పోలీస్ సైరన్ తీసివేయాలని సూచించారు. లేనియెడల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన యజమానులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సైరన్ వారి యొక్క స్వలాభం కోసం వాడుకొని దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

పోలీస్ సైరన్ పోలీస్ డిపార్ట్మెంట్ వాహనాలకు, మరియు ఎమర్జెన్సీ అంబులెన్స్ కు కొంతమంది స్థానిక ఎమ్మెల్యే, యంపి, వీఐపీ, వీఐపీలకు మాత్రమే ఉంటుందని తెలిపారు. సామాన్య ప్రజా ప్రతినిధి కూడా పోలీస్ సైరన్ బిగించుకొని వారి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లాలో కార్ డెక్కర్ షాపు యజమానులకు హెచ్చరిక ఎవరైనా వచ్చి పోలీస్ సైరన్ బిగించమని చెబితే బిగించవద్దని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అలా బిగించిన షాపు యజమానిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కొండా రాజీనామా లేనట్టే,...

వరంగల్: తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ ఓ చిన్న సునామినే సృష్టించారు. ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా రేగిన దుమారం కొండా సురేఖ కేటీఆర్‌పై చేసే ఆరోపణల క్రమంలో నాగార్జున కుటుంబాన్ని టార్గెట్ చేయడంతో అసలు వివాదం ప్రారంభమయింది. రాజకీయాలతో సంబంధం లేని సినీ కుటుంబాన్ని టార్గెట్ చేయడంపై ఇండస్ట్రీ ఘాటుగా స్పందించింది. అయితే తర్వాత కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లుగా ప్రకటించారు. కానీ వివాదం మాత్రం కొనసాగుతోంది. కొండా సురేఖపై నాగార్జున రెండు పరువు నష్టం పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై వాంగ్మూలాలు నమోదు చేస్తున్నారు. ఇప్పుడు ఆ అంశానికి ప్రాధాన్యత లేదని కోర్టుకు చేరిందని ఇక రాజకీయం ఏమీ లేదని కాంగ్రెస్ తేల్చేసోంది. సురేఖతో రాజీనామా చేయించాలని హైకమాండ్ తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలకు సూచనలు చేసినట్లుగా ప్రచారం జరిగింది. ప్రియాంకా గాంధీ అక్కినేని అమలతో మాట్లాడారని కూడా చెప్పుకున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి కొండా సురేఖను రాజీనామా చేయాలని అడిగినట్లుగా లేదని కనీసం మందలించినట్లుగా కానీ ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. పైగా కొండా సురేఖ ఒంటరి కాదని ఆమెను అదే పనిగా టార్గెట్ చేస్తే మేమంతా ఉన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ నేరుగానే హెచ్చరికలతో కూడిన ప్రకటనలు చేశారు. ఆ తర్వాత నాగార్జునపై కబ్జా కేసు కూడా నమోదు అయింది. ఈ పరిణామాలను బట్టి చూస్తే కొండా సురేఖకు కాంగ్రెస్ పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచిందని స్పష్టమవుతోందని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా స్పందించలేదు. కానీ కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత ఓ మీడియా సమావేశంలో పరోక్షంగా స్పందించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను కామెడీ చేశారు. పరువు నష్టం దాఖలు చేశారట.. పరువు నష్టం పిటిషన్ అని ఎద్దేవా చేసే ప్రయత్నం చేశారు. ఆ ప్రకారం చూస్తే కొండా సురేఖ విషయంలో రేవంత్ రెడ్డి ఏ మాత్రం అసంతృప్తికి గురి కావడం జరగలేదని ఆమెకు పూర్తి స్థాయిలో సపోర్టుగా ఉన్నారని అర్థమవుతుంది. నిజానికి ఇలాంటి రాజకీయ వివాదాలు వచ్చినప్పుడు సొంత పార్టీ నేతలకు నైతికంగా మద్దతుగా నిలకవకపోతే పార్టీ నేతల్లో స్థైర్యం తగ్గిపోతుంది. తమపై విపక్షాలు ఏదైనా వివాదాలు సృష్టించినా ఇంతేనా అనుకుంటారు. అదే సమయంలో విపక్ష పార్టీలకు బలం వస్తుంది.

అలాంటి వివాదాలను మరిన్ని తెరపైకి తెస్తారు. ఈ రాజకీయంపై రేవంత్ రెడ్డికి స్పష్టత ఉంది కాబట్టి బీఆర్ఎస్ ట్రాప్‌లో పడలేదని చెబుతున్నారు. నాగార్జున విషయంలో కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి సానుకూల అభిప్రాయం లేదు. బీఆర్ఎస్ నేతలతో నాగార్జునకు మంచి సంబంధాలు ఉన్నాయనేది బహిరంగరహస్యం. ఆయన ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఆర్థిక వనరుల పంపిణీలో ఒక టూల్ అని గట్టిగా నమ్ముతారు. అందుకే కొండా సురేఖ వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పెద్దగా స్పందించలేదు. సురేఖకు నైతిక మద్దతు అందించారు. కొండా సురేఖకు అండగా ఉండటంలో రేవంత్ పర్ ఫెక్ట్ స్ట్రాటజీని పాటించారని కాంగ్రెస్ వర్గాలు కూడా సంతృప్తిగా ఉన్నాయి.

# రోజుకు 110 కోట్ల మద్యం

హైదరాబాద్: తెలంగాణలో దసరా సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి. గత 8 రోజుల్లో మద్యం విక్రయాలు కూడా భారీగా జరిగాయి. 8 రోజుల్లో 8.37 లక్షల మద్యం కేసులు, 14.53 లక్షల బీరు కేసులు విక్రయించారు. ఈ నెల 1వ తేదీ నుంచి గణాంకాలు పరిశీలిస్తే 8 రోజుల్లో రూ.852.38 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.తెలంగాణలో దసరా, బతుకమ్మ సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి. పండగంటే ప్రతి ఇంట్లో మటన్ ముక్క, మద్యం చుక్క ఉండాల్సిందే. దీంతో రాష్ట్రంలో గత 8 రోజుల్లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో విక్రయాలతో పోలిస్తే 25 శాతం(5 రోజుల్లో) అధికంగా మద్యం అమ్మకాలు జరిగాయని దుకాణదారులు అంటున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి గణాంకాలు పరిశీలిస్తే 8 రోజుల్లో రూ.852.38 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. గతేడాది దసరాతో పోలిస్తే ఈ సారి ఐదు రోజుల్లో అమ్మకాలు 15 శాతం పెరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో రోజుకు రూ.124 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెల 10న రికార్డు స్థాయిలో రూ.139 కోట్ల విలువైన మద్యం డిపోల నుంచి వైన్ షాపులకు తరలించారు. ఒకే రోజు ఏకంగా 2.35 లక్షల బీర్లు వైన్ షాప్ లకు చేరాయి. ఈ ఏడాదిలో ఈ రెంజ్ లో బీర్ల అమ్మకాలు జరగడం ఇదే రికార్డు అని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.సాధారణంగా రోజుకు లక్ష కేసుల వరకు రూ.100 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా లిక్కర్ అమ్మకాలు భారీగా పెరిగాయి.5 రోజుల మద్యం విక్రయాలు పరిశీలిస్తే రోజుకు 1.20 లక్షల కేసుల మద్యం, 2 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. ఈనెల 1 నుంచి గణాంకాలను పరిశీలిస్తే 8 రోజుల్లో రూ.852.38 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. గత 8 రోజుల్లో 8.37 లక్షల మద్యం కేసులు, 14.53 లక్షల బీరు కేసులు విక్రయించారు. గతేడాది అక్టోబర్ 1 నుంచి 10 వరకు రూ.800 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా....ఈ ఏడాది 10 రోజుల్లో గతంలో కుంటే 6.55 శాతం మద్యం అదనంగా లాగించేశారని గణాంకాలు చెబుతున్నాయి.

# బఫర్ జోన్, ఎఫ్,టీఎల్ లో గుర్తించేది ఎలా...?

హైదరాబాద్: హైడ్రా వ్యవస్థ తర్వాత హెచ్ఎండీఏ పరిధిలో ఇళ్లు, ప్లాట్లు కొనే విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ఊఓఆం ప్రత్యేక వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది.హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద నగరాల్లో స్థలాలకు, ఇళ్లకు, ఫ్లాట్లకు భారీగా డిమాండ్ ఉంటుంది. శివారు ప్రాంతాల్లో కూడా ఇదే రేంజ్ ఉంటుంది. అయితే కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ స్థలాల్లో, చెరువుల్లో, నాలాల్లో, అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తుంటారు. ఇలాంటి వాటిని కొని చాలా మంది నష్టపోతుంటారు. చెరువులు, నాలాల రక్షణే ప్రధాన ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చింది. చెరువులు, నాలాల పరిధిలో నిర్మించిన ఇళ్లను కూల్చివేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ఇళ్లు లేదా స్థలాలు కొనుగోళ్లు చేసే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యమంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలు తెలుసుకోవాలి. ఈ వివరాలను సింపుల్ గా తెలుసుకునేందుకు వీలుగా ఊఓఆం ఏర్పాట్లు చేసింది. హెచ్ఎండీఏకు చెందిన వెళ్లి చెరువుల వివరాలతో పాటీ ఎఫ్‌టీఎల్, బపర్ జోన్ మ్యాప్ లను పొందవచ్చు. ఫలితంగా ఓ అంచనాకు రావొచ్చు. పైన పేర్కొన్న వెబ్ సైట్ లోకి వెళ్తే? జిల్లా, మండలం, గ్రామం సెలెక్ట్ చేసుకోవాలి. సర్వే నంబరును ఎంట్రీ చేస్తే ఆ ఊరిలోని అన్ని చెరువుల వివరాలు తెలుసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్ కాలమ్ కూడా ఉంటుంది. క్లిస్ చేస్తే మ్యాప్ ఓపెన్ అవుతుంది. వెబ్ సైట్ లో క్యాడస్ట్రల్ అనే ఆప్షన్ ఉంటుంది. దీనిపై క్లిక్ చేస్తే మరో మ్యాపు ఓపెన్ అవుతుంది. దీంతో ఆ చెరువు ఏయే సర్వే నంబర్ల పరిధిలో ఉందో తెలుస్తుంది. మ్యాప్‌లో నీలి రంగు లైన్‌తో ఉన్నది ఎఫ్‌టీఎల్ పరిధిని సూచిస్తుంది. ఆ పక్కనే రెడ్ కలర్‌తో ఉన్నదే బఫర్‌జోన్.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం

### జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్

రాజన్నన్న సిరిసిల్ల: గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 16 ఫిర్యాదులు స్వీకరణ. సోమవారం రోజున ఉదయం 10:00 గంటల నుండి 3:00 గంటల వరకు నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల వద్ద నుండి 16 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ

బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

# కార్తిక మాసోత్సవాల సమీక్షా సమావేశం

**నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తికమాసోత్సవాలు**

**క్షేత్ర పరిధిలో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు**

**పాతాళగంగవద్ద పుణ్యస్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

**కార్తికమాసమంతా గర్భాలయ అభిషేకాలు నిలుపుదల**

**కార్తికమాసంలోని సోమవారాలలో లక్షదీపోత్సవం**

**– పుష్కరిణి హారతి**



కార్తిక పౌర్ణమి రోజున పుణ్యనదీ హారతి, జ్వాలాతోరణం, లక్షదీపోత్సవం– పుష్కరిణి హారతి,

శ్రీశైలం: శ్రీశైలం లో నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వతేదీ వరకు కార్తికమాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. ఈ కార్తికమాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సోమవారం రోజు 14.10.2024 పరిపాలనాభవనంలోని సమావేశమందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్.రామాంజీనాయక్, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు జి. ప్రసాదరావు, జి.చంద్రబాబు కూడా పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, శ్రీస్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, క్యూలైన్ల నిర్వహణ, రద్దీక్రమబద్ధీకరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, కార్తికసోమవారాలు, లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తికపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం మరియు పుణ్యనదీహారతి ఏర్పాట్లు, కార్తికమాసంలో ఆకాశదీపం ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాలను గురించి సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. సమావేశంలో ముందుగా కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు మాట్లాడుతూ కార్తికమాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లన్నీ కూడా ముందస్తుగా పూర్తి కావాలని అన్నారు. ఈ నెల 31వ తేదీనాటికంతా ఏర్పాట్లన్నీ కూడా పూర్తి చేయాలని అన్నివిభాగాల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కార్తిక సోమవారాలు, కార్తికపౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశులు మరియు ప్రభుత్వ సెలవురోజులలో భక్తులరద్దీ అధికంగా ఉంటుందని చెబుతూ రద్ధికనుగుణంగా ఆయా ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ పాతాళగంగవద్ద శౌచాలయాలకు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరియు పాతాళగంగ మెట్లమార్గం మొదలైనచోట్ల అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. అదేవిధంగా గంగాభవానీ స్నానఘట్టాలకు కూడా అవసరమైన మరమ్మతులను చేయించాలన్నాడు.

# దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం...

హైదరాబాద్: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. దక్షిణ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. యానం, ఆంధ్రప్రదేశ్ లలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ దిశగా గాలులు వీచనున్నాయి. ఉపరితల ఆవర్తనం మరికొన్ని గంటల్లో అల్పపీడనంగా మారనుంది, దాని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నాయి. అక్టోబర్ 12 నుంచి 15, 16 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ లో అన్ని జిల్లాల్లో వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అది వాయుగుండంగా మారే క్రమంలో ఆంధ్రప్రదేశ్ పై ప్రభావం చూపుతుంది. ఏపీలో సోమవారం వరకు తేలికపాటి వర్షాల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. రాయలసీమలోనూ వర్ష సూచన ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అనంతపురంలో చినుకులు పడతాయని, మోస్తరు వర్షాలు లేకపోవడంతో కొన్నిచోట్ల ఉక్కపోత సమస్య సైతం తలెత్తనుంది.

తెలంగాణలో వర్షాలతో కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్

తెలంగాణలో పలు జిల్లాల్లో శనివారం, ఆదివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు గంటకు 30–40 కి.మీ వేగంతో వీచనున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలలో శనివారం ఉదయం వరకు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమరంభీం ఆసిఫాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, వనపర్తి, నల్గొండ, సూర్యాపేట జిల్లాలలో అక్టోబర్ 12, 13 తేదీలలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందిని ఎల్లో వార్నింగ్ జారీ చేశారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మహబూబ్ నగర్, నల్గొండ ప్రజలు భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ఏరియాల్లో చినుకులు పడతాయి. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీలు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచనున్నాయి.

# ఇంకా చల్లారని పీఏసీ ఛైర్మన్ వ్యవహారం

హైదరాబాద్: మొన్న పీఏసీ చైర్మన్.. నేడు శాసనమండలి చీఫ్ విప్ పదవులపై కాంగ్రెస్ , బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. తనకు దక్కాల్సిన పీఏసీ చైర్మన్ పదవి అరికపూడి గాంధీకి దక్కడంపై హరీష్‌రావు అప్పట్లో ధ్వజమెత్తారు. తాజాగా పట్నం మహేందర్‌రెడ్డిని చీఫ్ విప్‌గా అపాయింట్ చేయడంపై మండిపడుతున్నారు. పార్టీ మారిన వారికి ఆ పదవులు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శిస్తున్నారు. ఆ క్రమంలో హరీష్‌కు మంత్రి శ్రీధర్‌బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు తాము రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తున్నామని.. హరీష్‌రావు ప్రతిదాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని యద్దేవా చేశారు. ఏ రాష్ట్రమైన విపక్షానికి అసెంబ్లీలో దక్కే ప్రధాన పదవుల్లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి ఒకటి శాఖల వారీగా ప్రభుత్వ పద్దులను స్క్రూటినీ చేసే బాధ్యత పీఏసీ పరిధిలో ఉంటుంది ఆ పదవి కోసం బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి హరీష్‌రావుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదించారు అయితే అది అనూహ్యంగా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి దక్కింది దాంతో పార్టీ మారిన గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఎలా ఇస్తారని అప్పట్లో హరీష్ రావు నానా హడావుడి చేశారు. అప్పుడే కాంగ్రెస్ నేతలు అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ లోనే ఉన్నారని పేర్కొన్నారు గాంధీ సైతం తాను పార్టీ మారలేదని స్పష్టం చేశారు తాజాగా శాసనమండలి చీఫ్ విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దానిపై హరీష్ రావు మళ్లీ రియాక్ట్ అయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీని చేర్చుకుని చీఫ్ విప్ పదవి ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమని ధ్వజమెత్తుతున్నారు .. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్నం మహేందర్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇస్తారని అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ ఛైర్మన్ స్వయంగా .. పట్నం మహేందర్ రెడ్డి చీఫ్ విప్ ఎంపికైనట్లు బులెటిన్ ఇవ్వటం ఏంటని ప్రశ్నిస్తున్నారుపట్నం మహేందర్ రెడ్డి అనర్హత పిటిషన్ కౌన్సిల్ ఛైరన్ దగ్గర పెండింగ్ లో ఉందని సీఎం రేవంత్ రెడ్డి రేవంత్ హాయాంలో రాజ్యాంగం ఎలా ఖూనీ అవుతుందనే దానికి ఇదొక ఉదాహరణని హరీష్ రావు అం న్నారు .పీఏసీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలానే వ్యవహరించిందని అప్పుడు అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని స్వయంగా సీఎం, మంత్రులు చెప్పారని మరి పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. హరీష్‌రావు వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు .. ప్రతిదాన్ని రాజకీయం చేయటం హరీష్ రావుకు అలవాటైందని విమర్శించారు.. హరీష్ రావు వ్యవస్థలను రాజకీయాల్లోకి లాగడం కరెక్ట్ కాదని .. రాజ్యాంగానికి లోబడే పట్నం మహేందర్ రెడ్డిని మండలి చీఫ్ విప్ గా నియమించామని ఘాటుగా రిటార్ట్ ఇచ్చారు. ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న హరీష్ రావు శాసనసభ వ్యవహారాలమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో ఎలా చేర్చుకున్నారో చెప్పాలని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు .. కేసీఆర్ హాయాంలో హరీష్ రావుకు రాజ్యాంగం గుర్తుకు రాలేదా అప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసే ప్రయత్నం చేసిందెవరని యద్దేవా చేశారు. పీఏసీ చైర్మన్‌గా ఉన్న అరికెపూడి గాంధీ తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటున్నారు..

ఆయనపై బీఆర్ఎస్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు ఇటు పట్నం మహేందర్‌రెడ్డిపైనా పార్టీ పరమైన చర్యలకు గులాబీ నేతలు సాహసించడం లేదు తాము అధికారంలో ఉన్నప్పుడు అన్ని పార్టీల వారిని చేర్చుకున్న కారు పార్టీ పెద్దలు.. ఇప్పుడు తమ పార్టీని వీడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోర్టుల కెక్కుతున్నారు.. మొత్తమ్మీద వలసలు పెరిగిపోతుండటంతో పార్టీ ఉనికి కాపాడుకోవడానికే బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఎప్పటికప్పుడు హడావుడి చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

# ప్రధాని మోడీకి మిక్సీ...

కరీంనగర్: ప్రధాని నరేంద్ర మోదీ లక్కీ డ్రాలో మిక్సీ గెలుచుకున్నారు. ఔను మీరు విన్నది నిజమే. దసరా సంధర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా సంధర్భంగా ఈ విచిత్రం జరిగింది. దసరా అంటేనే అదొక సంబరం. నగరాలు, పట్టణాలలో కన్నా గ్రామాలలోనే సందడి అధికంగా ఉంటుంది. ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారు.. తప్పక ఈ పండుగకు తమ గ్రామాలకు చేరుకుంటారు. అందుకే గ్రామాలలో దసరా సందడి ఏమో కానీ.. ప్రతి ఇంటా సందడి వాతావరణం కనిపిస్తుంది. ఉదయాన్నే పూజలు, ఆ తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే ఈ సారి చాలా గ్రామాలలో లక్కీ డ్రా కాంటెస్ట్ ల హవా సాగింది. ఈ లక్కీ డ్రాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అదృష్టాన్ని పరిక్షించుకున్నారు. లక్కీ డ్రాలో ఎవరైనా తమ ఇష్టమైన వారి పేర్లు కానీ, లేక దేవుళ్ల పేర్లు గానీ రాస్తారు. అలా చేస్తే లక్కీడ్రా చేజిక్కించుకుంటామన్న అభిప్రాయం వారిలో ఉంటుంది. అయితే ఇక్కడ ఓ వ్యక్తి అందరి కంటే భిన్నంగా ఆలోచించాడు. చివరికి గిఫ్ట్ పట్టేశాడు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో శ్రీ శక్తి యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందరూ చిన్నా, పెద్దా తేడా లేకుండా పాల్గొని నవరాత్రుల సంధర్భంగా బతుకమ్మ తల్లిని ఏర్పాటు చేసి, అమ్మవారి చెంత భక్తిగీతాలను అలపిస్తూ సందడి చేశారు. అయితే ఇక్కడ దసరాను పురస్కరించుకొని లక్కీ డ్రా కాంటెస్ట్ కూడా నిర్వహించారు. ఈ కాంటెస్ట్ లో అందరూ పాల్గొన్నారు. అయితే ఓ వ్యక్తి మాత్రం లక్కీ డ్రా లో పాల్గొనేందుకు వచ్చి, తన పేరు రాయలేదు.. తన కుటుంబ సభ్యుల పేర్లు రాయలేదు.. ఇంతకు ఎవరి పేరు రాశాడో తెలుసా.. తన అభిమాన నేత , మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పేరు వ్రాసి లక్కీ డ్రాలో పాల్గొన్నాడు. ఈ విషయం ఎవరికీ చెప్పకుండా సైలెంట్ గా ఉన్నాడు ఆ వ్యక్తి. ఇంకేముంది.. లక్కీడ్రా తీసే సమయం రానే వచ్చింది. నేరుగా ప్రధాని పేరు రాస్తే నాకు బహుమతి రాదా అనుకుంటున్నాడు మదిలో. ఈ కాంటెస్ట్ లో మొదటి బహుమతిగా కూలర్, రెండవ బహుమతిగా మిక్సర్, మూడవ బహుమతిగా గ్యాస్ స్టవ్ ప్రకటించారు. మొదటి కూపన్ బయటకు తీశారు. వేరే పేరు వచ్చింది. ఇక మనోడి ఆశలు ఇక గల్లంతే అనుకున్నాడు. అప్పుడే రెండవ కూపన్ బయటకు తీసిన నిర్వాహకుడు వెంటనే నరేంద్ర మోదీజీ అంటూ కేకలు వేశాడు. ఇక అంతే అక్కడ ఉన్నవారందరూ షాక్. ఈయన ఎవరు స్వామీ ఏకంగా ప్రధాని పేరు మీద లక్కీడ్రా లో పాల్గొన్నాడు అంటూ అతని వైపే చూశారు. ఇక మనోడికి మిక్సీ వచ్చేసింది. చకచకా చేతిలో పట్టుకున్నాడు ఇంటికెళ్లాడు. మనతో మజాకా.. మా నేత పేరు రాస్తే.. లక్ లక్కీగా తగలాల్సిందే అంటూ స్థానికులతో తన ఆనందాన్ని పంచుకున్నాడు ఆ వ్యక్తి. మొత్తం మీద ఇదన్న మాట.. ప్రధానికి లక్కీడ్రా లో మిక్సీ లభించడం వెనుక ఉన్న రహస్యం. మీరు కూడా ఈసారి ట్రై చేస్తారేమో ట్రై చేయండి మరి.

# కేటీఆర్ కు ఊహించని షాక్...

హైదరాబాద్,రిస్థితిలో కేటీఆర్ సోమవారం మాజీ ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అనారోగ్యంతో నిమ్స్ లో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం అందరికీ తెలిసిందే. గతంలో మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన్ని నాగ్‌పూర్ కేంద్ర కారాగారంలో ఉంచారు. 2017లో ఆయనకు గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవితఖైదు విధించింది. దీంతో దాదాపు తొమ్మిదేళ్లపాటు జైల్లోనే గడపాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించడంతో నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. కాగా ఇప్పటి బీఆర్ఎస్ అప్పుడు టీఆర్ఎస్ గా ఉండి తెలంగాణ విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చింది. నాడు సాయిబాబాను పోలీసులు అరెస్ట్ చేసినా.. ప్రభుత్వం నుండి తగిన సహకారం అందలేన్నది సాయిబాబా వర్గం వాదన. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై నినదించేందుకు కూడా సంఘాలకు అవకాశం కల్పించలేదని కూడా ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. సాయిబాబా అరెస్ట్ సమయంలో నాడు అధికారం ఉండి కూడా.. నిరసన తెలిపేందుకు ఎటువంటి అవకాశం ఇవ్వకపోగా.. ప్రజాస సంఘాలకు మద్దతు ఇవ్వకపోవడంతో నాడు బీఆర్ఎస్ పై వ్యతిరేక పవనాలు వీచాయి. దాని ఫలితమే నేడు మాజీ మంత్రి కేటీఆర్ కు నిరసన ఎదుర్కోవాల్సి వచ్చిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కాగా మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి చెందగా.. పలువురు నివాళులర్పించారు. పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు సంతాపం వ్యక్తం చేసి, ఆయన మృతదేహాన్ని సందర్శించారు. ఇలా కేటీఆర్ కూడా అక్కడికి చేరుకోగా.. కేటీఆర్ గో బ్యాక్ కేటీఆర్ అంటూ కామ్రేడ్స్ నినాదాలు చేశారు. పదేళ్లు సాయిబాబా జైలులో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఏం చేసిందని వారు నినాదాలు చేశారు. నాడు ఏమి చేయక నేడు నివాళి అర్పించడానికి ఎలా వస్తారంటూ ఆందోళన తెలిపారు. అయితే కేటీఆర్ మాత్రం.. సైలెంట్ గా సాయిబాబా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇప్పుడు అధికారంలో లేకున్నా.. కేటీఆర్ కు నిరసన సెగ తాకడం విశేషం కాగా.. కేటీఆర్ కూడా సైలెంట్ గా అక్కడినుండి వెనుతిరిగారు. ఇక సాయిబాబా భౌతికకాయాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున ప్రజా సంఘాలు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు బందోబస్తు చేపట్టారు. అలాగే సాయిబాబా మృతిపట్ల పలువురు మేధావులు సంతాపం వ్యక్తం చేయగా, కళాకారులు పాటల రూపంలో సాయిబాబా జీవిత చరిత్రను ఆలపిస్తున్నారు.

# మూసీ పోరాటంపై డైలమాలో బీఆర్ఎస్

హైదరాబాద్: తెల్లారితే ఆందోళన చేస్తున్నామ్. వాళ్ల గొంతై వినిపిస్తున్నామ్. ఆ టాపిక్‌ను ఎవరూ చేయలేనంత హైలెట్ చేస్తున్నాం. ఇంతకీ అక్కడ బాధితులు ఎవరు.? బడాబాబులు ఎవరు.? మనం చేస్తున్న ఆందోళన పేదల కోసమేనా.? మూసీ అంశంలో మనం చేస్తున్న పోరాటం కరెక్టేనా.? లేదంటే ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఏదో ఓ ఆందోళన చేయాలి కాబట్టి రోడ్డెక్కుతున్నామా.? మూసీ ప్రక్షాళనపై చేస్తున్న పోరాటంతో మైలేజ్ వస్తుందా..లేక మూసీ మురికి అంటుకుంటుందా..బీఆర్ఎస్ పార్టీని ఇవే ప్రశ్నలు వెంటాడుతున్నాయట. అసలు ఆందోళనలు అవసరమా అన్న డైలమాలో పడిందట కారు పార్టీ. మూసీ కంపు తీస్తామని సర్కార్..ముంపు బాధితుల పరిస్థితి ఏంటని బీఆర్ఎస్..పెద్దఎత్తున డైలాగ్ వార్ నడుస్తోంది. మూసీ ప్రక్షాళన పేరుతో ఆక్రమణలను తొలగిస్తుండటం దుమారం లేపుతోంది. ఈ అంశంపై బీఆర్ఎస్ మూసీ నిర్వాసితుల పక్షాన నిలుస్తుంది. తెలంగాణ భవన్‌లో నిర్వాసితులతో సమావేశాలు నిర్వహిస్తూనే..మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఇప్పటికిప్పుడు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెచ్చి మూసీ ప్రక్షాళన చేస్తారని..ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నారు. అంతేకాదు మూసీ నిర్వాసితులను ఉన్నఫలంగా పంపిచేస్తే వాళ్లు ఎక్కడికి వెళ్తారని, వారికి తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ భరోసా ఇస్తోంది. నిర్వాసితుల ఇళ్లపై బుల్డోజర్ వాలితే ఊరుకోమని.. ఏ రాత్రి ఫోన్ చేసినా వస్తామని చెబుతూ భరోసా ఇస్తున్నారు. అయితే మూసీ ప్రక్షాళనపై పోరాటం కరక్టేనా అన్న డైలమాలో పడిందట బీఆర్ఎస్. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఏదో ఒక ఆందోళ చేయాలన్న దాంట్లో మూసీపై పోరాటం చేస్తున్నామా అని బీఆర్ఎస్ నేతలు ఆలోచిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా దాదాపు 16వేల ఆక్రమణలు తొలగిస్తున్నా.. అందులో మెజార్టీ జనం పేద వర్గాల వారే. వారందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని రేవంత్ సర్కార్ చెబుతోంది. ఇదే అంశం బీఆర్ఎస్ నేతలను సందిగ్ధంలో పడేసిందట. మూసీ ఆక్రమణదారుల్లో వేలాది మందికి మంచే జరుగుతుండగా తక్కువ మందికి మాత్రమే నష్టం జరుగుతోందన్న విషయాన్ని ఆలస్యంగా గ్రహించారట. మెజార్టీ పేదలకు మంచి జరిగే కార్యక్రమాన్ని అడ్డుకుని, వందల మంది కోసం ఆందోళన, పోరాటం చేస్తే రాజకీయంగా మైలేజ్ వస్తుందా రాదా అన్న డైలమాలో పడ్డారట బీఆర్ఎస్ నేతలు. అందుకే మూసీ ప్రక్షాళనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని ప్రకటించిన కేటీఆర్..పునరాలోచనలో పడ్డారన్న టాక్ వినిపిస్తోంది. మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడే ప్లాన్ చేసి అధికారిక ఉత్తర్వులు కూడా ఇచ్చారని కాంగ్రెస్ పెద్దలు ఆధారాలతో సహా వివరిస్తున్నారు. మీరు మూసీ ప్రక్షాళన చేస్తే మంచి పని, అదే మేము చేస్తే తప్పవుతుందా అని సీఎం రేవంత్ సహా మంత్రులు ఎదురుదాడికి దిగడంతో బీఆర్ఎస్ నేతలు డైలమాలో పడ్డట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో కాస్త సర్దుకున్న బీఆర్ఎస్ నేతలు..

తాము కేవలం 17వేల కోట్లతో మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు ప్లాన్ చేస్తే..ఇప్పుడు ఏకంగా లక్ష కోట్లపైగా ఎందుకు ఖర్చు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. మూసీ ప్రక్షాళన వెనక ఏదో అవినీతి దాగి ఉందని ఆరోపిస్తున్నారు గులాబీ లీడర్లు. అయితే మూసీపై ఎంత పోరాటం చేసినా, ఎన్ని నిరసనలు చేపట్టినా తమకు అంత మైలేజీ రావడం లేదన్న చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో మొదలైందని తెలుస్తోంది. ఇంతకీ మూసీపై మనం చేస్తున్న పోరాటం సరైనదేనా అన్న సందేహం కూడా వ్యక్తం అవుతోందట. మనం అధికారంలో ఉన్నప్పుడు చేయాలనుకున్న పనిని ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ చేస్తోందని..మూసీ బాధితుల కోసం ఆందోళన చేస్తున్నా అది పెద్దగా ప్రజల్లోకి వెళ్లడం లేదన్న థాట్‌లో పడిపోయారట గులాబీ నేతలు.

# వికలాంగులకు ప్రైవేటు రంగంలో నాలుగు శాతం రిజర్వేషన్లు

హైదరాబాద్: సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్ లైన్ లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేసారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, దివ్యాంగులు వయోవృద్ధులు సాధికారత శాఖా జేడీ శైలజ తదితరులు హాజరయ్యారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ . ఇతర వర్గాల వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు వున్నాయి. శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదు. పోషకాహార లోపం,ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుంది. అందుకే వాళ్లకి ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్లైన్ జాబ్ పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలి. దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఆన్లైన్ జాబ్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుంటే చాలు. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయి. దుకోసమే పోర్టల్ లో అందుబాటులోకి తెచ్చాము. సంక్షేమ నిధుల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నాం. ప్రైవేట్ జాబ్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచెందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తాం. సబిలిటీని దృష్టిలో పెట్టుకొని వారిని ముందుకు తీసుకురావడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. సంక్షేమము, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని అన్నారు.

# ప్రతి కుటుంబంపై లక్ష రూపాయల అప్పు

హైదరాబాద్: లంగాణలో అప్పుల గురించి నాబార్డ్ సర్వేలో కీలక అంశాలు వెల్లడయ్యాయి. ఆదాయం పెరిగినా మిగులు తగ్గుతుందని నాబార్డ్ సర్వేలో తేలింది. అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులేనని నాబార్డ్ తేల్చి చెప్పింది. ఒక్కో కుటుంబంపై అప్పు భారం లక్షకు పైనే ఉంది.తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై సగటున లక్షా 29 వేల 599 రూపాయల అప్పు ఉంది. నాబార్డ్ ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. రాష్ట్రంలో అప్పుల్లో ఉన్న కుటుంబాల సంఖ్య 79 శాతం నుంచి 92 శాతానికి పెరిగింది. తెలంగాణలోని ఒక్కో కుటుంబ నెలవారీ సగటు ఆదాయం రూ.7,811 నుంచి రూ.12,065కి పెరిగింది. జాతీయ సగటు రూ.8,059 నుంచి రూ.12,698కి చేరిందని నాబార్డ్ సర్వే వెల్లడించింది.తెలంగాణలో వ్యవసాయ కుటుంబ నెలవారీ సగటు ఆదాయం రూ.8,951 నుంచి రూ.13,874 కి చేరింది. జాతీయ సగటు రూ.8,931 నుంచి రూ.13,661కి పెరిగింది. ప్రస్తుతం అత్యధికంగా పంజాబ్‌లో ఒక్కో రైతు కుటుంబానికి రూ.31,433 ఆదాయం ఉంది. కుటుంబం నెలవారీ సగటు మిగులు ఇదివరకు రూ.998 ఉండగా.. ఇప్పుడు రూ.781కి పడిపోయింది.2021-22 వ్యవసాయ సంవత్సరంలో రుణం తీసుకున్న కుటుంబాలు 73 శాతంగా ఉన్నాయి. జాతీయ సగటు 42 శాతం మాత్రమే ఉంది. వ్యవసాయ రుణాల విషయంలో ఏపీ, తెలంగాణ తొలి రెండు స్థానాలలో ఉన్నాయి. అదే సమయంలో.. కుటుంబ నెలవారీ సగటు వినియోగ వ్యయం రూ.6,813 నుంచి రూ.11,284 కి చేరింది. జాతీయ సగటు రూ.6,646 నుంచి రూ.11,262 ఉంది.తెలంగాణ రాష్ట్రంలోని 54 శాతం కుటుంబాలు ఎంతో కొంత పొదుపు చేస్తున్నాయి. పొదుపు విషయంలో జాతీయ సగటు 66 శాతంగా ఉంది. రాష్ట్రంలో 92 శాతం కుటుంబాలు గ్రామాల్లో, 8 శాతం సెమీ అర్బన్ ప్రాంతంలో ఉన్నట్లు నాబార్డ్ సర్వే వెల్లడించింది. వ్యవసాయ కుటుంబాలు 55 శాతం, వ్యవసాయేతర కుటుంబాలు 45 శాతం ఉన్నాయి.తెలంగాణలోని 20 శాతం కుటుంబాలు ఏదో ఒక రంగంలో పెట్టుబడి పెడుతున్నాయి. ఈ విషయంలో జాతీయ సగటు 27 శాతంగా ఉంది. ఉత్తర్‌ప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో అత్యధికంగా 36 శాతం కుటుంబాలు పెట్టుబడులు పెడుతున్నాయని నాబార్డ్ సర్వే వివరించింది. తెలంగాణలోని 58.2 శాతం కుటుంబాల్లో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు ఉన్నారు. వీటి ద్వారా పొదుపు, అప్పులు సులభతరం అయ్యాయి.

# ప్రజావాణి ఆర్జీలను వేగంగా పరిష్కరించాలి

**ప్రజావాణి ఫిర్యాదులు 22**

**అదనపు కలెక్టర్ పి.రాంబాబు.**

జగిత్యాల: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గౌతమ్ రెడ్డితో కలసి స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల,కోరుట్ల,ఆర్డీవోలు, మధు సుధన్, శ్రీనివాస్,కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిఖి హత్య వెనుక...

ముంబై: ముంబైలోని బాంద్రా ప్రాంతంలో సిద్ధిఖి తన కుమారుడి కార్యాలయం ఎదుట నవరాత్రుల సందర్భంగా టపాసులు కాల్చుతున్నారు. ఆయనకు సమీపంలోనే భద్రత సిబ్బంది ఉన్నారు. ఆయన టపాసులు కాల్చుతుండగా.. వారు ఆ దృశ్యాలను చూస్తూ ఆనందిస్తున్నారు. అందరూ కేరింతలు కొడుతుండగా.. ముగ్గురు వ్యక్తులు అత్యంత వేగంగా ద్విచక్ర వాహనాలపై వచ్చారు. సినిమాల్లో మాదిరిగానే అత్యంత సమీపం నుంచి తుపాకుల ద్వారా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సిద్ధిఖి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఒంట్లో నుంచి రక్తస్రావం తీవ్రంగా జరిగింది. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే లీలావతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న ఆయన.. ఆరోగ్యం విషమించి కన్నుమూశారు. అయితే ఈ ఘటనలో హర్యానా రాష్ట్రానికి చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారిస్తున్నారు. అయితే తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కు చెందిన వారమని ఆ నిందితులు ప్రకటించారు. అయితే మూడో నిందితుడు శివకుమార్ ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో ఇంకో వ్యక్తి కూడా ఉన్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.సిద్ధిఖి ని హత్య చేయడానికి నిందితులు కొద్ది నెలలుగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు ఈ విషయాన్ని సంబంధించి చర్చలు జరుపుతూ.. సిద్ధిఖి నివాసం, కార్యాలయంపై తీవ్రంగా నిఘా పెట్టారని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో సిద్ధిఖిని హత్య చేసేందుకు నిందితులకు లారెన్స్ గ్యాంగ్ 50 వేల చొప్పున ముందస్తుగా చెల్లించిందని.. పార్సిల్ విధానంలో మారణాయుధాలను సరఫరా చేసిందని తెలుస్తోంది. ఇక ఇదే ఏడాది ఏప్రిల్ నెలలో లారెన్స్ గ్యాంగ్ బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ఇంటివద్ద కాల్పులు జరిపింది. సల్మాన్ ఖాన్ నివాసం ఉండే గెలాక్సీ అపార్ట్మెంట్ వద్ద కాల్పులు జరపడంతో కలకలం నెలకొంది. ఆ ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే సల్మాన్ ఖాన్ ఇంటికి వెళ్లారు. ఆయనను పరామర్శించారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని సల్మాన్ ఖాన్ కు హామీ ఇచ్చారు.

ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే లారెన్స్ గ్యాంగ్ రెచ్చిపోయింది. సల్మాన్ ఖాన్ కు అత్యంత సన్నిహితుడైన సిద్ధిఖిని హతమార్చింది. ఇక ఈ ఘటన నేపథ్యంలో సల్మాన్ ఖాన్ ఇంటివద్ద.. ఆయన వ్యవసాయ క్షేత్రం వద్ద మహారాష్ట్ర ప్రభుత్వం బందోబస్తు ఏర్పాటు చేసింది. సిద్ధిఖి మరణ వార్త వినగానే సల్మాన్ ఖాన్ బిగ్ బాస్ షూట్ నుంచి అర్ధాంతరంగా బయటికి వచ్చారు.. సిద్ధిఖి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పులు జరిపిన తర్వాత లారెన్స్ గ్యాంగ్ లో ముఖ్యుడు అన్మోల్ కీలక ప్రకటన చేశాడు.. ఇది ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా ముందు ఉందని సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యానించాడు.

# డిల్లీలో రద్దీ ట్యాక్స్...

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా దేశ రాజధాని దిల్లీలో ప్రజలు చాలా కాలంగా రద్దీ రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ఇప్పటివరకు పెద్దగా పరిష్కారం దక్కలేదు. ఈ నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వం 'ట్యాక్స్' ఆలోచనతో ముందుకొచ్చింది. ఈ 'దిల్లీ కంజెషన్ ట్యాక్స్' ప్రకారం.. రద్దీ సమయంలో, ఎంపిక చేసిన రోడ్డు మీద మీరు ప్రయాణిస్తే అదనంగా- కొత్త ట్యాక్స్ కట్టాల్సి వస్తుంది! ఇలా చేస్తే, ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.రద్దీ సమయాల్లో నిర్దేశిత రహదారులను ఉపయోగించినందుకు డ్రైవర్లకు ఛార్జీలు వసూలు చేసే వ్యూహాన్ని రూపొందిస్తున్నామని రవాణా శాఖ ప్రత్యేక కమిషనర్ షహజాద్ ఆలం తెలిపారు.రవాణా నిర్వహణకు కొత్త నిధుల కేటాయింపు జరుగుతోంది. మేము పనిచేస్తున్నదాన్ని 'రద్దీ ధర(కంజెషన్ ప్రైజింగ్)' అని పిలుస్తున్నాము," అని ఆలం చెప్పారు.ఇందుకోసం ప్రయోగాత్మకంగా దిల్లీ సరిహద్దుల్లోని 13 కీలక ప్రాంతాలను గుర్తించి పైలట్ ప్రాజెక్ట్ని చేపట్టారు.దిల్లీలో సదరు "రద్దీ పన్ను" ప్రతిపాదన కొత్త విషయం కాదు. 2018లో అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ తొలిసారి ఈ ప్రతిపాదన చేశారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అధికంగా ఉండే రోడ్లపైకి ప్రవేశించే వాహనాలకు ఛార్జ్ వసూలు చేయాలని ఆయన ప్రతిపాదించారు.ట్రాఫిక్ని సులభతరం చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం ఈ ప్రయోగం ముఖ్య లక్ష్యం. నాడు.. ప్రభుత్వం నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు, ఈ విధానాన్ని అమలు చేయడానికి ముందు ప్రజల అభిప్రాయాన్ని కోరుతామని బైజల్ పేర్కొన్నారు. ఐటీఓ కూడలి, మెహ్రౌలి-గుర్గావ్ రోడ్డు సహా 21 హై ట్రాఫిక్ ప్రాంతాలను పన్నుకు అవకాశం ఉన్న ప్రాంతాలుగా ఆ సమయంలో దిల్లీ ప్రభుత్వం గుర్తించింది.2017లో పార్లమెంటరీ కమిటీ కూడా రాజధానిలో రద్దీగా ఉండే ప్రాంతాలపై టోల్ విధించాలని సిఫార్సు చేసింది.బెంగళూరులో జనసాంద్రత ఎక్కువగా ఉండే రోడ్లపై ట్రాఫిక్ని తగ్గించడానికి 'రద్దీ పన్ను' విధించాలని అధికారులకు ఇటీవలే ఒక నివేదిక సూచించింది.కర్ణాటక దశాబ్దం - 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి రోడ్ మ్యాప్ అనే శీర్షికతో కర్ణాటక ప్రణాళికా విభాగం, పరిశ్రమ బృందం ఇచ్చిన నివేదిక, రద్దీ సమయాల్లో నగరంలోకి ప్రవేశించే మినహాయింపు లేని వాహనాల నుంచి పన్ను వసూలు చేయడానికి ప్రస్తుత ఫాస్టాగ్ వ్యవస్థను ఆ నివేదిక ఉపయోగించాలని సూచించింది.ప్రజారవాణాను మెరుగుపరచడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, జీవన నాణ్యతను పెంచడానికి ఈ ఆదాయాన్ని ఉపయోగించవచ్చని తెలిపింది.సింగపూర్, లండన్, స్టాక్హోమ్ వంటి నగరాలు ట్రాఫిక్ని నిర్వహించడానికి, రద్దీని తగ్గించడానికి ఇలాంటి పన్నులను విజయవంతంగా అమలు చేశాయి.మరి ఈ కంజెషన్ ట్యాక్స్ మీద మీ ఒపీనియన్ ఏంటి? ఇది అమల్లోకి వస్తే ప్రజలపై మరింత భారం పడినట్టు అవుతుందా? లేక నిజంగానే ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందా?

# ఆలయ దోషులను కఠినంగా శిక్షించాలి

సికింద్రాబాద్: మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మోండా మార్కెట్ లోని కుమ్మరిగూడ లో గల ముత్యాలమ్మ దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటనా స్థలికి చేరుకొని ఆలయంలోకి వెళ్ళి పరిశీలించారు. పోలీసు అధికారులు, స్థానికులను ఘటన కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఓ.ఎం తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు మత ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు బతుకమ్మ, దుర్గామాత నవరాత్రులు ఎంతో ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం జరిగింది, ఇంతలోనే ఈ ఘటన జరగడం బాధాకరం అన్నారు.ఈ ఘటన తో ఒక వర్గం ప్రజలు తమ మనోభావాలను దెబ్బతీసే చర్యగా తీవ్ర ఆగ్రహం తో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటన లో ఇద్దరు ముగ్గురు వరకు బాగస్వాములు అయినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారని, వారిలో ఒక్కరు మాత్రమే పోలీసుల అదుపులో ఉన్నారని తెలిపారు. ఈ ఘటనలో ఎంతమంది ఉన్నారో పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట మోండా డివిజన్ బీఆర్ఎస్‌పార్టీ అద్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు నాగులు, మహేందర్, మహేష్, సత్యనారాయణ, అమర్ తదితరులు ఉన్నారు.

# ఇంకా సాగుతున్న ఆర్జీ కార్ ఆస్పత్రి వ్యవహారం

కోల్ కత్తా: ఆర్ జి కర్ ఆస్పత్రిలో జరిగిన దారుణానికి సంబంధించి బాధితురాలికి న్యాయం చేయాలని జూనియర్ వైద్యులు ఇప్పటికే నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష కు సంబంధించిన వార్తలు దేశవ్యాప్తంగా మీడియాలో ప్రముఖంగా ప్రసారమవుతున్నాయి. దీంతో సోషల్ మీడియా నుంచి మొదలుపెడితే మీడియా వరకు ఈ విషయం చర్చల్లో ఉంటున్నది. ఫలితంగా ప్రజల నుంచి అపూర్వమైన మద్దతు లభిస్తుంది. ఈ క్రమంలో ఆర్జీ ఆస్పత్రి తో సహా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన దాదాపు 200 మందికి పైగా సీనియర్ వైద్యులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ముకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మరో 77 మంది వైద్యులు రాజీనామాలు చేసేందుకు సిద్ధమయ్యారు. కోల్ కతా లోని కళ్యాణి జేఎన్ఎం ఆసుపత్రికి చెందిన 77 మంది వైద్యులు వెస్ట్ బెంగాల్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు ఈ మెయిల్ పంపించారు. అందులో రాజీనామా విషయాన్ని ప్రకటించారు. అక్టోబర్ 14 వరకు గడువు ఇస్తున్నామని.. ఈలోగా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే విధులకు రాబోమని హెచ్చరించారు.." జూనియర్ వైద్యులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. వారి ఆరోగ్యం క్షీణిస్తోంది. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని" ఆ వైద్యులు రిజిస్ట్రార్ కు పంపిన మెయిల్ లో ఈ విషయాన్ని వెల్లడించారు. " మేము పనిచేస్తున్న చోట మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో పని చేయలేకపోతున్నాం. దాని వెనుక చాలా కారణాలు ఉన్నాయి. జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపించడం లేదు. హత్యాచారానికి గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి. ఆరోగ్య కార్యదర్శి ఎన్. ఎస్ నిగం ను విధుల నుంచి తొలగించాలి. పని చేసే చోట భద్రత చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్లను అక్టోబర్ 14లోగా పరిష్కరించాలి.. లేని పక్షంలో అధికారికంగా మేము మొక్కుమటిగా రాజీనామాలు చేస్తామని" వైద్యులు పేర్కొన్నారు. అయితే ముక్కుమ్మడిగా రాజీనామాలు చేయగా.. వాటిని పలువురు వైద్యులకు బెంగాల్ ప్రభుత్వం శనివారం తిరిగి పంపింది. సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా వైద్యులు వ్యక్తిగతంగా రాజీనామా చేయాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఆ రాజీనామాల విషయంలో వైద్యులు కాస్త వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది.ఆ వైద్యురాలి హత్యాచార ఘటన లో మమతా బెనర్జీ వ్యవహరించిన తీరు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. హైకోర్టు, సుప్రీంకోర్టు ఈ కేసులో ఇన్వాల్వ్ కావడంతో.. మమత బెనర్జీకి ఊపిరి తీసుకునే సమయం కూడా లేకుండా పోతుంది. ఇటీవల వైద్యులతో పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ అంతగా ప్రయోజనం లేకుండానే ముగిసాయి. ఇక ఇటీవల వైద్యులతో మమత చర్చలు జరిపారు. వాటిని లైవ్ రికార్డ్ చేయడానికి ఒప్పుకున్నారు. వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి పరిష్కారానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో.. పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దీంతోపాటు జూనియర్ వైద్యులు నిరసనకు దిగారు. వారికి సీనియర్ వైద్యులు సంఘీభావం చెబుతున్నారు. ఫలితంగా మమతా బెనర్జీ ప్రభుత్వానికి ఎటూ పాలు పోవడం లేదు.

# జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు..?

హైదరాబాద్: ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ కేంద్రం నిర్ణయం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోంశాఖ జమ్మూకశ్మీర్‌లో త్వరలోనే కొలువుదీరనున్న ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం, ఇటీవలే ఎన్నికలు జరుపుకున్న కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు అయిందని, తద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర హోంశాఖ పేర్కొంది. అక్టోబర్ 31, 2019న జారీ చేసిన మునుపటి ఆర్డర్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు వెల్లడించింది. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని వివరించింది. ఈ మేరకు విడుదల చేసిన గెజిట్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేశారు.

జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019లోని సెక్షన్ 54 ప్రకారం ముఖ్యమంత్రి నియమకానికి ముందు అక్టోబర్ 31, 2019 నాటి రాష్ట్ర పాలనకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేశామని గెజిట్ ఉత్వర్వులో ప్రభుత్వం పేర్కొంది. కాగా ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370 రద్దుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన కొనసాగిన విషయం తెలిసిందే.

# శభాష్ అక్బర్ సాబ్....

**అక్బర్ సేవలు రాష్ట్రానికే ఆదర్శం**

**అభినందనలతో "ప్రశంసా పత్రం" అందజేసిన విడిసి**

జగిత్యాల: జిల్లా లోని బుగ్గారం గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్బర్ ను "శభాష్ అక్బర్ సాబ్" అంటూ గ్రామ ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటి కొనియాడారు. గ్రామ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఆయనకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం అభినందనలతో కూడిన''ప్రశంసా పత్రం'' అందజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విడిసి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా పంచాయతీ కార్యదర్శి అక్బర్ గ్రామానికి, ప్రజలకు అందజేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామ పంచాయతీలో తగిన బడ్జెట్ లేకున్నా - ప్రజల సహకారంతో "బతుకమ్మ - దసరా" పండుగల ఉత్సవాలకు ఆయన చేసిన గొప్ప ఏర్పాట్లను, సౌకర్యాలను, ఆయన అందించిన సేవలను, స్వయంగా అక్బర్ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజల్లో, ఉత్సవాలలో కూడా పాల్గొన్న విధానాన్ని, సమయ స్ఫూర్తితో వ్యవహరించిన తీరును వివరించారు.

కుల - మతాలకతీతంగా పంచాయతీ కార్యదర్శి అక్బర్ చేసిన సేవలను గ్రామ ప్రజలంతా గుర్తించి ముక్త కంఠంతో కొనియాడుతున్నారని చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి "అక్బర్ సేవలు" రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని, ప్రపంచ ఖ్యాతి పొందాలని వారంతా ఆశించారు. ఇలాంటి ప్రజా సేవకులు ఉంటే గ్రామాలు అత్యున్నత స్థాయిలో అభివృద్ధిని సాధిస్తాయని అన్నారు. ఇలాంటి ప్రశంసలు, పురస్కారాలు, అవార్డులు, రివార్డులు, పదోన్నతులు ఇంకా ఎన్నెన్నో అక్బర్ సాబ్ పొందాలని వారంతా మనసారా కోరుకుంటున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, వైస్ చైర్మన్ పెద్దనవేని రాగన్న, విడిసి ఉపాధ్యక్షులు సుంకం ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి పెద్దనవేని రాజేందర్, సాంస్కృతిక కార్యదర్శి డా: నక్క రాజు, సహాయ కార్యదర్శి కళ్లెం నగేష్, కాశెట్టి మహేష్, మాజీ సర్పంచ్ మసర్తి రాజిరెడ్డి, దసర్తి పోచన్న,గంజి జగన్, అక్కల రాజేష్, నక్క సాయి, జంగ రవి, జంగ రమేష్, జంగ మల్లేశం, వడ్ల రమేష్, కేతి మల్లయ్య, ఇస్త్రీ పోచన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను తరలించాలి

**- అఖిలపక్ష నాయకులతో కలిసి బీబీనగర్ వాసుల ధర్నా**



బీబీనగర్: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలోని ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను వెంటనే అక్కడ నుంచి తరలించాలని స్థానిక ప్రజలు అఖిలపక్ష నాయకులతో కలిసి పరిశ్రమ గేటు ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు మాట్లాడుతూ.. కాలుష్య కారకమైన ఈ పరిశ్రమ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అంతేకాకుండా దీర్ఘకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు.. శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. పరిశ్రమను మూసివేసి ఇక్కడి నుంచి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిశ్రమ మూసివేసేంత వరకు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు ధర్నా నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక పోలీసులు ధర్నా స్థలికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నిర్వహించకుండా శాంతియుతంగా ధర్నా నిర్వహించాలని గ్రామస్తులు, నాయకులను కోరారు. ధర్నా అనంతరం పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో నాయకులు, పోలీసులు చర్చలు జరపగా.. ఒక్కరోజు గడువు ఇవ్వాల్సిందిగా యాజమాన్యం కోరడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. సమస్యను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని పరిశ్రమ ప్రతినిధులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పొట్టోల్ల శ్యామ్‌గౌడ్, గోళి పింగళ్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, గోలి నరేందర్‌రెడ్డి, పొట్ట నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురకంటిసత్తిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**